## జీవిత సభ్యత్వం

**2012 జూన్ – జూలై నెలలో పంపిన వారి వివరాలు**

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 1. | జూలై 2012 | వి. సూర్యనారాయణ, శ్రీకాకుళం | 500–00 |
| 2. | జూలై 2012 | పి.వి.సుబ్బారావు, అక్కాయపాలెం | 500–00 |
| 3. | జూలై 2012 | రాజారాం సింగ్, పాల్వంచ,ఖమ్మం | 500–00 |
| 4. | జూలై 2012 | పి. దుర్గ, మౌలాలి, హైదరాబాద్ | 500–00 |
| 5. | జూలై 2012 | జి. మంజుల, ధర్మవరం, | 1000–00 |
| 6. | జూలై 2012 | శ్రీ కృష్ణ దండమూడి, ఏలూరు | 500–00 |
| 7. | జూలై, 2012 | డి. చిన్నారావు, రాజాం, శ్రీకాకుళం | 300–00 |
| | | **మొత్తం** | **3,800–00** |

# పత్రిక సభ్యత్వం

1. మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/– (వెయ్యి రూపాయలు). 2. రెండు దఫాలుగా కూడా రూ.500/– చొప్పున చెల్లించవచ్చు. 3. జీవిత సభ్యత్వం చెల్లింపులపై వచ్చే వడ్డీని మాత్రమే పత్రిక నిర్వహణా ఖర్చులకు వినియోగించాలి. అయితే నేటి వరకు జీవిత సభ్యత్వంపై వచ్చిన వడ్డీని కూడా అసలు మొత్తానికే జమచేయడమైనది. 4. వార్షిక సభ్యత్వం రూ.100/– పోస్టల్ మనీ ఆర్డర్ ద్వారా పంపవలిసింది. 5. బ్యాంకు డ్రాఫ్టు లేదా బ్యాంకు చెక్కు ద్వారా పంపగోరు వారు శ్రీమతి నిర్మలాదేవి, హైదరాబాద్ పేరున పంపగలరు.


## మా అడ్రస్:

**ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్, యాప్రాల్, ప్లాట్ నెం.32, జె.జె. నగర్ కాలనీ, సికింద్రాబాద్–500087. ఫోన్: 99595–53218**
**malladisukku@gmail.com, krishnanandm@yahoo.com,**



Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.
**Editor: D.Nirmaladevi**

RNI No. APTEL/2002/7310, Postal Concession: R&D/RNP/HSE/789/2012-2014, **Dt.19-12-2011**


# మెహెర్‌బాబా


**అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక**

సంపుటి :12 సంచిక: 03 హైదరాబాద్ జూలై 2012 పేజీలు 40

**Please visit : www.srimeherbaba.com వార్షిక సభ్యత్వం : రూ. 100/–**




# ఖమ్మం సెంటర్

## అవతారుని అంతర్జాతీయ ప్రేమిక సహవాస్

### పసిడి పండుగ వేడుకలు - ఆగస్టు 10,11,12,13 తేదీలలో..,

అవతారుని అంతర్జాతీయ ప్రేమిక సహవాస్ ఖమ్మంలోని భక్త రాందాసు కళా క్షేత్రంలో ఏర్పాటు చేసినట్లు అధ్యక్షులు శ్రీ రాయల రామచంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా, ఖమ్మం పట్టణంలోని జహీరపుర ప్రాంతంలో వున్న బాబా సెంటర్‌లో 2012 ఆగస్టు 10, శుక్రవారం ఉ. 6.45 నుండి 8 గంటల వరకు ప్రార్థనలు, ఆరతి, సప్తవర్ణ పతాకావిష్కరణ కార్యక్రమం జరుగుతుంది. అనంతరం, స్థానిక కళాక్షేత్రంలో ఆగస్టు 10 నుండి 13వ తేదీ మధ్యాహ్నం 2.30 వరకు అవతారుని సందేశాలపై పలువురి ప్రసంగాలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

ఈ సహవాస్‌కు సుమారు 2 వేల మందికి పైగా బాబా ప్రేమికులు పలు ప్రాంతాల నుండి హాజరవుతున్నట్లు ప్రాథమిక సమాచార భోగట్టా. అమెరికా, బ్రిటన్ తదితర దేశాల నుండి కూడా బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు.

**వసతి ఏర్పాట్లు:** విచ్చేసే బాబా ప్రేమికులందరి కోసం తగిన రీతిలో వసతి ఏర్పాట్లు చేసామని శ్రీ రామచంద్రయ్య తెలిపారు. విశాలమైన ఐదు ఫంక్షన్ హాళ్ళు, స్థానిక హోటళ్ళలో, బాబా ప్రేమికుల ఇళ్ళలో విచ్చేసే వారికి ఎలాంటి అసౌకర్యం కలగని రీతిలో తగిన ఏర్పాట్లు చేశామన్నారు. స్త్రీలు, వయస్సులో పెద్దవారి కోసం ప్రత్యేక వసతి ఏర్పాట్లు చేశామన్నారు. అలాగే తగిన రవాణా సౌకర్యంగా ఆరు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఆగస్టు 10,11 తేదీలలో రైలు, బస్ స్టేషన్‌లలో విచ్చేసే వారికి సహాయంగా రాత్రింపగళ్ళు వాలంటీర్లు అందుబాటులో ఉంటారు. భారీ స్థాయిలో తొలిసారిగా తెలుగునాట ఏర్పాటు చేస్తున్న ఈ అంతర్జాతీయ సమావేశాలకు రమారమిన రు. 15 లక్షలు ఖర్చు కాగలదని అంచనా. కాగా, ఈ సందర్భంగా **మెహెరాబాద్ దివ్య ధామం, ఖమ్మం సెంటర్ సావనీర్** ప్రత్యేక ప్రచురణలను ఆవిష్కరిస్తున్నారు.

**ఆనాడు** -ప్రప్రథమంగా 1963 ఏప్రిల్ 28న శ్రీ సి.యస్.మాణిక్య ప్రభు గారి ఇంట్లో ఖమ్మం బాబా సెంటర్ ఏర్పాటయింది. శ్రీ చాగంటి సుబ్బారావు, శ్రీ యం.బి.వి.ఐ.ఆర్. శర్మ, శ్రీ జె. సుదర్శనం వంటి పెద్దలు బాబా సెంటర్‌కు విశేష సేవలు అందజేశారు. 1985 నుండి శ్రీ ఆర్. రామచంద్రయ్య సెంటర్ కార్యదర్శిగా వున్నారు. శ్రీ గులాబ్ దాస్ పాంచాల్ 1991 ఫిబ్రవరి 25న సెంటర్ సొంత భవనాలకు శంఖుస్థాపన చేశారు. 1996 మే 12న శ్రీ కె.కె. రామక్రిష్ణన్ బాబా ప్రార్థనాలయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఖమ్మం సెంటర్ ఆధ్వర్యంలో 1986,1993,1996 లలో జాతీయ స్థాయి బాబా ప్రేమిక సహవాస్‌లు జరిగాయి. ఈ అంతర్జాతీయ ప్రేమిక సహవాస్‌కి బాబా ప్రేమికులందరూ విచ్చేసి జయప్రదం చేయాలని రామచంద్రయ్య (98486 07718) కోరుతున్నారు.





## మెహెర్‌బాబా సందేశం

ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నతికి **ప్రేమ-సేవ** అతి ముఖ్యం. తోటివారిని ప్రేమించడం, అవసరమైనవారికి సేవలందించడం సర్వోన్నతం, అత్యుత్తమం. అంతేకాదు, **"ప్రేమ-సేవ"** ఈ రెండూ కళ్ళుమూసుకుని చేసే భగవధ్యానంకంటే ఎన్నోరెట్లు ఉన్నతమైనదని మెహెర్‌బాబా తన సందేశంలో వెల్లడించారు.

In spiritual matters love and service to humanity supersede meditation. ` • Lord Meher Vol. IV page 2340 (New Edition)

**గౌరవ సంపాదకులు**
**మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**krishnanandm@yahoo.com**
**malladisukku@gmail.com**

**వ్యవస్థాపకులు:**
**దశిక ప్రసాదరావు**
**040-65699611**

## లోపలి పేజీలలో...

1. సంపాదకీయం 5
2. 87వ మౌన వార్షికోత్సవం 6-9
3. సర్వధర్మాన్ పరిత్యజ్య... 10
4. గురు పూర్ణిమ వేడుకలు 11
5. కృష్ణనాయర్ 12-17
6. మా మాటలు 18-19
7. లార్డ్ మెహెర్ 20-31
8. నవ జీవనము 32 -34
9. మా మాటలు 32-34
10. భక్తికి ప్రచారమా? 36-37
11. ప్రార్థనలు 38-39

**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం.32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218

## మనవి

**మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**

Please visit : www.srimeherbaba.com



Beloved's Bonze statue in Mehersthan
Kovvur, W.G. Dist, A.P. India

# మెహెరస్థాన్ ధర్మశాల సప్తమ వార్షికోత్సవం

మెహెరస్థాన్ ధర్మశాల 7వ వార్షికోత్సవాన్ని 2012 జులై 29 ఉ. 7.30 నుండి సాయంత్రం 6 గంటల దాకా నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి శ్రీ వై.యస్. రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మెహెరాబాద్ నుండి శ్రీ మెహెర్‌నాథ్ కల్చూరీ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరవుతున్నారు. కాగా ఉత్తరాదిన గల పలు బాబా సెంటర్ల ప్రేమికులు విశేష సంఖ్యలో పాల్గొంటున్నారని, స్థానిక తెలుగు బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొని బాబావారి ఆశీశ్సులు పొందవలెనని శ్రీ రావు కోరుతున్నారు.

# మెహెరాబాద్‌లో ప్రాక్‌పశ్చిమ స్వర్ణోత్సవాలు

## 2012 నవంబరు 1 నుండి 4 దాకా

2012 నవంబరులో మెహెరాబాద్‌లో East West Gathering 50th Anniversary నిర్వహించాలని నిర్ణయించారు. 1962లో పూనేలో మెహెర్‌బాబా ప్రాక్‌పశ్చిమ సమావేశాలు నిర్వహించిన సంగతి బాబా ప్రేమికులకు తెలుసు. ఈ సమావేశాలు జరిగి 50 సంవత్సరాలు నిండిన సందర్భంగా, ఆనాటి మధుర స్మృతులు స్మరించుకునేలా, 2012 నవంబరు 1నుండి 4 వరకూ ఓ నాలుగు రోజులపాటు ఈ సంబరాలు నిర్వహించనున్నారు.

1962 **East West Gathering**లో పాల్గొన్న బాబా ప్రేమికులు ఈ కార్యక్రమాల్లో ప్రత్యేకంగా పాల్గొని తమ అనుభవాలు వివరించాలని, ఒకవేళ వారు స్వయంగా పాల్గొనలేని పక్షంలో తమ తాలూకా వివరాలను రాసి పంపాలని, వాటిని ఒక పుస్తక రూపంలో ప్రచురించ తలపెట్టినట్లు తెలిపారు. భజనలు, ప్రసంగాలు, ఫిల్ము ప్రదర్శనలతో పలు విశేష సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేసినట్లు, వీటిలో పాల్గొనగోరు ఆసక్తిగల బాబా ప్రేమికులు తమ వివరాలను శ్రీగోకర్ణం శ్రీవాత్సవ, మెహెరాబాద్ హిల్సులైబ్రరీ,మెహెరాబాద్, ఫోన్-0241-2548473 పంప కోరుతున్నారు.





## సంపాదకీయం

# మౌనావతారుని మౌనదిన మహత్యం

మౌనావతారుడు శారీరకంగా వీడ్కోలు తీసుకొన్నా నూరు సంవత్సరాలపాటు మీతోటే వుంటాను, పిలిస్తే పలుకుతాను అన్నారు.

ఆ మాట అక్షరాలా నిజమేనని ఈ జులై 10వ తేదీ నిరూపించింది.

'మా దగ్గర నీళ్ళు లేవు. కరంట్ లేదు. రావద్దు రావద్దంటే రావద్దు అని మెహెరాబాద్ ట్రస్టీలు ఎంతగా ఎలుగెత్తి చెప్పినా, ప్రభువు కోరుకొన్నవారు వచ్చారు.

ప్రభుపాదసేవలో పరమార్థత నాశిస్తున్నవారు వచ్చారు.

ఈ వింత చూసి పోదామనుకొంటూ సంస్కారాల ప్రేరణతో వచ్చారు మరికొందరు. వెరసి మొత్తం అంచనాలకి మించిన సంఖ్య అయింది.

మౌన దినం నాడు ముందురోజు, మర్నాడు అంతే. మూడు రోజులపాటు ఆకాశం మేఘాలతో కమ్ముకుంది. అడపాదడపా చిరుజల్లులు పడ్డాయి. అమృత వర్షమది. సామాన్యులకి లభించని దివ్య వరమది.

మెహెర్ ప్రభువు పరమాత్ముడు అని నమ్మితే, ఆ నమ్మకం ఆటుపోటుల్ని తట్టుకొని నిలబడాలి. బాబావారి మండలి సభ్యుల నుంచి నేర్చుకోవాల్సిన సారమిదే.

ఓ ఇరానీవాడు దేముడేమిటి అని వేళాకోళం చేస్తున్న రోజుల్లో అవతారుని చుట్టూ చేరి కష్టాలని వోర్చారు. అందుకే ధన్యజీవులయ్యారు. అలా అని మండలి వారందరూ ఒక తాటిపై నడిచారా అంటే అదీ లేదు. తిట్టుకొన్నారు. కొట్టుకొన్నారు. అరచుకొన్నారు. చివరకి బాబావారితో మొరపెట్టుకొన్నారు. అటువంటి ధోరణి ఇప్పుడూ కన్పిస్తోంది మెహెరాబాద్‌లో. అప్పట్లో అవతారుడు స్వయంగా వినేవాడు అందరి గోడు. ఇప్పుడు సమాధిలో చిరునవ్వుల జల్లు కురిపిస్తూ సరదాగా గమనిస్తున్నాడు. శృతిమించితే మొట్టికాయి తప్పదన హెచ్చరిక ఇస్తున్నాడు. అలనాటి ధోరణీలు సంస్కారాల హరణ ప్రకరణం. ఇలనాటి ధోరణులు అష్టమ భూమికావిర్భావం. అప్పటికీ ఇప్పటికీ తేడా ఇదే. గమ్మత్తు ఏమంటే ఇదంతా బాబావారు చెప్పినట్లే జరుగుతుండటం. అంటే ప్రభుని ఇచ్ఛ ఇదేనా? కావచ్చు. మెహెరాబాద్‌లో అవతారుని ఇచ్ఛ లేకుండా ఏపని జరగదనీ, ఎవరి అడుగూ ముందుకు పడదనీ అంటారు. నిజమే కాబోసు అనిపిస్తుంది.

ఈ ఏటి మౌన దిన విశేషాలు చూశాక.

- మ.రా.రా

# 87వ మౌన వార్షికోత్సవం




87వ మౌన వార్షికోత్సవం ఘనంగా ముగిసింది.

బాబా ప్రేమికులు వారెక్కడున్నా ఆయా ప్రాంతాల్లో సమిష్టిగానో, వ్యక్తిగతంగానో ప్రతి ఏటా జూలై 10 నాడు మౌనం పాటిస్తారు. బాబా నామం జపిస్తూ జూలై 9 అర్థరాత్రి నుండి 10వ తేదీ అర్థరాత్రి దాకా బాబానామ స్మరణలో గడుపుతారు.

ఐతే, ఎప్పటిలాగానే వీలున్నవారు కొంతమంది మెహెరాబాద్ వెళ్ళి బాబా సమక్షంలో మౌనం పాటించారు. అలా ఈ దఫా మెహెరాబాద్‌కు వెళ్ళిన కొద్దిమందిలో మేం కూడా వున్నాం. మౌనవార్షికోత్సవానికి మెహెరాబాద్ వెళ్ళనివారికి, ఆనాటి అక్కడి విషయాలు-విశేషాలు తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ఈ చిన్ని ప్రయత్నం చేస్తున్నాం. దయచేసి పరిశీలించండి.

మెహెరాబాద్‌లో ప్రతి ఏడాది కంటే ఈసారి వర్షాభావ పరిస్థితి చాలా భిన్నంగా వుంది. ఇది అందరికీ తెలిసిన విషయమే. ఏమంటే ఈ ఏడాది జూన్ 28 దాకా చుక్క వాన పడలేదు. బావులు ఎండిపోయాయి. త్రాగడానికి కూడా నీరు దొరకని పరిస్థితిలో మెహెరాబాద్, ఆ చుట్టు ప్రక్కల గ్రామాలున్నాయి.

కాగా, జూన్ 22న స్థానిక బాబా ప్రేమికులు, మెహెర్ ఇంగ్లీషు హైస్కూలు లోని విద్యార్థులు, ఆరంగాం గ్రామస్తులందరూ మెహెరాబాద్‌లో వున్న ధుని ప్రాంగణంలో సమావేశమయ్యారు. ధుని వెలిగించ లేదు కానీ, ధుని ప్రాంగణం చుట్టూతా పూల దండలుతో అలంకరించారు. గ్రామస్తులు కొందరయితే కొబ్బరికాయలు కొట్టారు.ఆ పిదప బాబా ప్రార్థనలు, భజనలు చేశారు. హృదయంతో తమ ఆవేదనను అవతారునికి తెలియజేశారు.

అదొక అరుదైన వర్ణింపగా రాని అద్భుత దృశ్యమని ఆనాటి కార్యక్రమంలో పాల్గొన్న పెద్దలు తెలిపారు. ఇంతటి వేడుకోలు ఆలకించనివాడు కాదు కదా...మన అవతారుడు...

అ దరిమిలా జూన్ నెల చివరిలో వాతావరణశాఖవారి లెఖ్ఖల్ని తప్పు చేస్తూ, ఎనిమిది సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఎండిన బీడు భూములు తడయ్యాయి. బావుల్లో





తగినంత నీరు వచ్చి చేరిందని తెలిసింది. ఈ నేపథ్యంలోనే బాబా ట్రస్టు వారు ఈ దఫా మౌనానికి బాబా ప్రేమికులు పరిమితంగా వస్తే బాగుంటుందని జూన్ నెల మొదటి వారం నుండీ హెచ్చరించారు. ఇదొక రకంగా విపత్కర పరిస్థితి అని వారు అభివర్ణించారు.

తెలుగువారు గత కొన్నేళ్ళుగా బాబా మౌన వార్షికోత్సవానికి అధిక సంఖ్యలోనే వెళ్తున్నారు. ప్రతి ఏడాది ఈ సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది కూడా.

ఈ దఫా ట్రస్టువారి విన్నపాల వల్లనో ఏమో, ప్రతి ఏటా మౌనం రోజుకు వచ్చే బాబా ప్రేమికులు చాలామంది రాలేదు. తొంభై శాతం మంది క్రొత్త ముఖాలే కనపడ్డాయి. నెల్లూరు జిల్లా కావలి దగ్గరల్లోని గుడ్లూరు గ్రామం నుండి 80 మంది క్రొత్తవారు, తొలిసారిగా మెహెరాబాద్ వచ్చారని వారికి నేతృత్వం వహించిన శ్రీ సింహాచలం, పెరికేడు సెంటరు, శ్రీ బ్రహ్మారెడ్డి, కావలి సెంటర్ వారు చెప్పారు.

ఇదేమాదిరిగా గుంటూరు, విజయనగరం, తూర్పు గోదావరి జిల్లాల నుండి సుమారుగా ఓ 200 మంది క్రొత్తవారు తొలిసారిగా మెహెరాబాద్‌లో బాబాను దర్శించుకున్నారు. విజయనగరం నుండి శ్రీ కొల్లి రామారావు గారి నేతృత్వంలో సుమారు నూరు మంది క్రొత్తవారు వచ్చారు.

ఎన్నో సంవత్సరాల నుండి బాబా ప్రేమలో పండిపోయినవారి మాదిరిగా వారందరూ జూలై 10న మౌనం పాటించారు.

అవతారుని ఆశీశ్శులు అందుకున్నారు.

ఈ దఫా మెహెరాబాద్‌లోని సి, డి, హాస్టల్సులో సుమారు ఒక వెయ్యిమందికి మాత్రమే వసతి కల్పించినట్లు సమాచారం.

అలాగే, ఆంధ్రా రెస్టుహౌసులో రమారమిన 350 మందికి వసతి కల్పించారు.

కాగా కొందరు ప్రైవేటు అద్దె ఇళ్ళలో ఉన్నారు.

మెహెరాబాద్ చుట్టూతా బాడుగకు ఇచ్చే అపార్టుమెంట్లు క్రొత్తగా చాలానే వెలిసాయి.

ఒక్కో గదికి రోజుకి నాల్గొందలు చొప్పున వసూలు చేస్తున్నట్లు సమాచారం.

ఏమైనా ట్రస్టువారు ముందుగా హెచ్చరించినట్లే జూలై 9వ తేదీ నాడు సి. డి. హాస్టల్సులో వున్నవారికి స్నానాలకు నీళ్ళు ఇవ్వలేదు. దాంతో తెలుగువారు తమ సహజధోరణిలో రుస రుసలాడారు. వారికి ముందుగా తెలిస్తే తమ ప్రయాణం వాయిదా వేసుకునేవాళ్ళమన్నారు. దూరప్రాంతాల నుండి వెళ్ళినవారికి, వెళ్ళగానే స్నానం చేసి శుభ్రమవ్వాలనుకోవడం సహజం. కానీ వారికి ఆ అవకాశం రెండ్రోజుల తర్వాత కానీ చిక్కలేదని చాలామంది చికాకు పడ్డారు.

బందరు సెంటర్ వారు, శ్రీమతి సీతమ్మ గారి బృందం ఎప్పటిలా మంచి భోజన ఏర్పాట్లు చేశారు. ఇది చాలామందికి తగిన ఉపశమనం కల్గించింది.

ఇకపోతే ఆంధ్రా రెస్టు హౌసులో వసతి పొందినవారికి ఈ బాధలు ఏమీ లేవనే

చెప్పాలి. ఏమాటకామాట, వై. యస్. రావ్ ఎన్ని ట్యాంకర్ల నీళ్ళు ఎక్కడ్నుంచి తెప్పించి అక్కడున్న సంపుని నింపారో, అందుకు ఎంత ఖర్చు చేశారో ఎవరూ పట్టించుకోలేదు కానీ, కుళాయిల్లో నీరు మాత్రం ధారాళంగా మంచి ఫోర్సుతో వచ్చాయి. పరిమితంగానైనా వృధా చేస్తూనే స్నానాలు గట్రా తీరుబడిగా అందరూ తృప్తిగా చేశారు.

దేవుని సన్నిధికి స్నానాదికాలు ముగించుకుని పరిశుభ్రంగా వెళ్ళాలన్నది మన సంస్కృతి కదా.. ఆ వీలు ఇక్కడ అందరూ పొందారు. మీదుమిక్కిలి, గుమ్మం బయటకు రాగానే పది మంది సుఖంగా ప్రయాణించేలాగా ఒక పెద్ద ఆటోనొకదాన్ని వయస్సురీత్యా పెద్దవాళ్ళకోసమని రెస్టుహౌసు ఏర్పాటు చేశింది. యువతరం కూడా ఈ సదవకాశాన్ని బాగానే వినియోగించుకున్నారు.

సుమారు 200 మందికి ఆంధ్రా రెస్టు హౌసులో పరుపులున్న మంచాల ఏర్పాటు కల్పించారు.

## మూడవ అంతస్తులో కాటేజీలు

ఇదిలావుంటే, ఆంధ్రారెస్టు హౌసు మూడో అంతస్తులో నిర్మాణంలో వున్న కాటేజీల పనులన్నీ పూర్తిచేసి వాటిని సంబంధిత యజమానులకు అప్పజెప్పేశారు. ఏదేనీ కారణాలవల్ల ఆయా ఓనర్లు రానిపక్షంలో ఆ గదులను వచ్చేసే బాబా ప్రేమికులకు ఇవ్వగలమని వైయస్ అన్నారు.

## మరో శుభవార్త.

అదేమంటే, మూడో అంతస్తులో 6 కాటేజీల నిర్మాణం, వాటి అప్పగింతలు పూర్తయ్యాయి కాబట్టి, రాబోయే ఆరు నెలలులో, వచ్చే అమరతిథి నాటికి, నాలుగో అంతస్తులో ఒక విశాలమైన హాలు నిర్మాణం చేపట్టాలని వైయస్ ప్రతిపాదించారు.

అదేమాదిరిగా, ప్రస్తుతమున్న రెస్టుహౌసుకు ఉత్తర-దక్షిణాలలో గల ఖాళీ జాగాలో వచ్చే అమరతిథినాటికి తాత్కాలిక షెడ్డుల నిర్మాణం చెపట్టి, బాబా ప్రేమికులకు తగిన అదనపు వసతి సౌకర్యం కల్పించాలని తమ ఆలోచనగా వుందని శ్రీ రావు అన్నారు.

ఈ పనులన్నీ అనుకున్నదనుకున్నట్లు పూర్తయితే, వచ్చే అమరతిథినాటికి సుమారు వెయ్యి మందికి సునాయాసంగా వసతి సౌకర్యం లభిస్తుందని అంచనా.

ఇది వయస్సు రీత్యా పెద్దవారికి, మహిళలకు ఊరటనిచ్చే శుభవార్త.

ఈ మాటలన్నీ శ్రద్ధగా ఆలకిస్తున్న బాబా ప్రేమికుడొకరు ఛలోక్తిగా... అనుకున్నది చేసి చూపుతాడు.. పని రాక్షసుడు...శ్రీ వైయస్ అని ఛలోక్తిగా అన్నా, ఆ మాటల్లో నిజం లేకపోలేదనిపిస్తుంది.

ఏదిఏమైనా శ్రీ రావు గారికి బాబా ఆ అవకాశాన్ని, తగిన సహాయాన్ని అందించాలని కోరుకుందాం. మౌన దినం రోజున, ఆ మర్నాడు కూడా బాబా ప్రేమికులనందరినీ







వానల కోసం మెహెరాబాద్‌లో 2012 జూన్ 22న ప్రార్థనలు జరిపారు.

మెహెరాజాద్ సందర్శించేందుకు ట్రస్టువారు బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. అలాగే, ఎ-హాస్టలులో ఎప్పటిలా బాబావారి చలనచిత్రాలు ప్రదర్శించారు. సి-హాస్టలు దగ్గర బాబా సాహిత్యం, లాకెట్లు, బ్యాడ్జీలు, ఫోటోలుతో స్టాల్సును ఏర్పాటు చేశారు. ఇదిలావుంటే డి-హాస్టలు సమీపంలో జాగిలాల స్వైరవిహారంతో హైదరాబాద్ ప్రేమికులను బాధించాయి. రాబీపోర్ ఇంజక్షన్‌లు ఇచ్చారని బాధితులు చెప్పారు. వసంత కాలం కదా...జూలై 10కి ముందు రోజు, ఆ తర్వాత కూడా మెహెరాబాద్‌లో బాబా సమాధి ప్రాంగణంలో చల్లని గాలులు, మధ్య మధ్యలో చిరుజల్లులుతో వాతావరణం చాలా చల్లగా ఆహ్లాదంగా వుంది. చాలా హాయిగా వుంది. మేం వున్న ఆ రెండు మూడు రోజుల్లో కొద్దిపాటి వాన జల్లులు అడపాదడపా కురిసాయి. జూలై 20 తర్వాత ఎప్పటిలా మెహెరాబాద్‌లో హాస్టలు వసతి కల్పించే వీలుంటుందని, ట్రస్టు సభ్యులు పేర్కొన్నారు. మెహెరాజాద్‌కు కూడా బాబా ప్రేమికులందరూ వెళ్ళేందుకు తగిన అనుమతి ఉంటుందని అన్నారు. కాగా, మేం జూలై 11న తిరిగి హైదరాబాద్‌కు బయల్దేరాం. ఐతే చాలామంది జూలై 12న నిర్వహించే ధుని కార్యక్రమాన్ని దర్శించుకుని స్వగ్రామాలకు బయల్దేరతామని చెప్పారు. అక్కడ ఎన్ని రోజులున్నా తనివి తీరదు. మెహెరుడు కొలువు తీరిన స్వర్గధామం -మెహెరాబాద్. బాబా ప్రేమికులందరికీ **భూకైలాస్** మెహెరాబాద్. త్వరలో మళ్ళీ మెహెరాబాద్‌కు వెళ్ళేరోజుల్ని లెఖ్ఖించుకుంటూ మేం మా గమ్యాన్ని చేరుకున్నాం.

**మల్లాది కృష్ణానంద్**

క్రొత్త పుస్తకం

# సర్వధర్మాన్ పరిత్యజ్య...




శ్రీ కేశవ్ నారాయణ్ నిగం హమీర్‌పూర్ జిల్లాకు చెందిన బాబా ప్రేమికుడు.

మెహెర్‌బాబా ఆదేశాల మేరకు శ్రీ కేశవ్ నారాయణ్ నిగం తన జీవిత చరిత్రను ఇంగ్లీషులో **మై లైఫ్ స్టోరీ విత్ అవతార్ మెహెర్‌బాబా** పేరుతో 1960వ దశకంలోనే గ్రంధస్తం చేశారు. ఆ రాసిన చిత్తు ప్రతిని ఆయన బాబాకు చూపించారు కూడా. ఇంగ్లీషులో వున్న ఈ పుస్తకాన్ని తెలుగులో **సర్వధర్మాన్ పరిత్యజ్య** శీర్షికతో మెహెర్‌బాబా పత్రిక తరఫున ప్రచురించి 2012 జూన్‌లో విడుదల చేయడమైంది.

కేశవ్ నారాయణ్ నిగం తన జీవితాన్ని బాబా పాదాల చెంత అంకితం చేశారు.

శ్రీ నిగం గొప్ప మేధావి. ఆయన స్వాతంత్ర సమర యోధుడిగా జైలుశిక్ష అనుభవించాడు. హమీర్‌పూర్‌లో గొప్ప సంఘసేవకుడిగా, అడ్వకేటుగా, కీర్తిగడించాడు.

రాష్ట్ర సమాచార శాఖ డైరక్టర్‌గా పనిచేశాడు. జిల్లా పరిషత్ బోర్డు సెక్రటరీగా నిజాయితీగా తన సేవలు అందజేశాడు.

ఆ దరిమిలా మెహెర్‌బాబా ఆయన్ని ఒక అరుదైన లెటర్ ఆఫ్ అపాయింట్‌మెంట్‌తో హమీర్‌పూర్ జిల్లాలో బాబా సేవలో తన కార్యకర్తగా నియమించి నెలకు జీతంగా రూ.350 చొప్పున ఇచ్చారు.

ఆయన హిందీలో వెలువడుతున్న పుకార్ పత్రికకు సంస్థాపక సంపాదకుడు.

ఆ నియామకం కూడా మెహెర్‌బాబానే స్వయంగా చేశారు.

మెహెర్‌బాబా నవజీవనంలో ఉన్నప్పుడు ఆ కార్యక్రమంలో పాల్గొనలేకపోయానేనన్న వ్యధతో, అవతారుని దర్శనం లభించడంలేదేనన్న విరహంతో 40 పాదాల పద్యాలు **మెహెర్ చాలీసాను** రాసి ఆలాపిస్తూ గడిపారు.

ఈ గీతాలను బాబావారు స్వయంగా 10 సార్లుకు పైగా కేశవ్‌జీని అడిగి





పాడించుకున్నారు. తన హృదయాన్ని దోచిన గీతమాలిక **మెహెర్ చాలీసా** అని మెచ్చుకోలుగా బాబా కేశవ్‌జీని పలుమార్లు అభినందించారు.

మేను పులకరింపజేసే అనేక వాస్తవ జీవిత సంఘటనలు ఈ రచనలో కనిపిస్తాయి. కేశవ్‌జీ తన జీవితంలో అనుభవించిన అనేక ఉద్ధాన పతనాలను ఆసాంతం చదివిన పాఠకులు ప్రతి పదంలో తమ కళ్ళలో నీళ్ళు చిప్పరిల్లాయని చెప్పారు.

బాబా ప్రేమికులందరికీ కేశవ్‌జీ ఆదర్శం. ప్రతిఒక్కరూ తప్పక చదవాల్సిన గ్రంధం, ప్రతి ఇంటా ఉండాల్సిన పుస్తకం..**సర్వధర్మాన్ పరిత్యజ్య..**

**వెల..రూ. 50. ప్రాప్తిస్థానం..కేరాఫ్ ఎడిటర్, మెహెర్‌బాబా మాస పత్రిక.**

# గురు పూర్ణిమ వేడుకలు

గురు పూర్ణిమ రోజున 39 సంవత్సరాల క్రితం హైదరాబాద్‌లోని కోఠి ప్రాంతంలో శ్రీ నోరి ప్రకాశరావు గారింట్లో బాబా సెంటర్‌ను ప్రారంభించారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని జూన్ 30వ తేదీ సాయంత్రం, అలాగే జూలై 3న, గురు పూర్ణిమ రోజున స్థానిక సెంటర్ ప్రాంగణంలో గురు పూర్ణిమ వేడుకలు, సెంటర్ 39వ వార్షికోత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. చిన్నారి బాలల నుండి వృద్ధుల వరకూ బాబా సందేశాలపై అనేక ఆసక్తికర కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీమతి మీనాక్షమ్మ, శ్రీమతి సుశీల, శ్రీమతి గౌరి, తదితరులు ఓ పదిమంది మహిళలు బృందగానాలు ఆలాపించారు. చిన్నారి పిల్లలు మెహెర్ ఐశ్వర్య, మెహెర్ పరినిక – **మెహెర్ – మెహెర్** అని నృత్యం చేశారు. మెహెర్ నిధి, కృతి పండుగ రమణ రాసిన **'పండుగమ్మ పండుగ – మెహెర్ దేవుడు అండనుండగా'** కీర్తనను లయబద్ధంగా జానపద నృత్యంతో అలరించారు. మెహెర్ ప్రణవి శాస్త్రీయ నృత్యరీతిలో చక్కని నృత్యాన్ని ప్రదర్శించింది. శ్రీ వెంకటయ్య గారు కవిత వినిపించారు. బాబా మండలి సభ్యుడు – **బైదులు** – 'జైబాబా' అని చెబుతూ అనేక మందికి మందులిచ్చి వారి దీర్ఘ రోగాలను నయంచేశాడని తెలియజెప్పే సందేశాత్మక – లఘునాటికను మాస్టర్ మెహెరానంద్, మెహెర్ వివేక్, శ్రీధర్, శ్రీమతి నళిని తమ పాత్రలకు న్యాయం చేసి, కడుపుబ్బ నవ్వించారు. ఈ కార్యక్రమాలను శ్రీమతి నోరి స్వర్ణ, మెహెర్ రాఘవ, మెహెర్ ప్రసాద్ కడు సమర్ధవంతంగా నిర్వహించారు. ముందుగా శ్రీ నోరి సూర్యనారాయణ కోఠి సెంటర్ గురించి చెబుతూ, తొలి రోజుల్లో కర్పూర ఆరతులు, నూనెతో దీపారాధనలు తెలుగువారి ఆచార ప్రకారం బాబాకు ప్రార్ధనలు చేసేవారమన్నారు. అయితే ఒక రోజున దీపారాధన కుందెతోపాటు ఇతర పూజా సామాగ్రినంతా ఎవరో దొంగిలించారని, నాటితో కర్మకాండలను బాబా వ్యతిరేకించారన్న సంగతి గుర్తించి, బాబా ఇచ్చ ప్రకారం ఇక్కడ ప్రార్ధనలు నిర్వహిస్తున్నామని వివరించారు.

# మెహెర్‌బాబాతో కృష్ణ నాయర్

**ఆంగ్ల మూలం: TEARS OF JOY**

**శ్రీ అన్నా ఖండాలే,**
**మెహెరాబాద్.**
**తెలుగు సేత: మల్లాది కృష్ణానంద్.**



## ఆంతరింగికం

ఏప్రిల్ 1953లో మెహెర్‌బాబా డెహ్రాడూన్‌కి దగ్గర్లో గల ముస్సోరీలో వున్నారు. నేను ఎప్పటిలా రాత్రి కాపలాదారుడిగా బాబా ఆశ్రమం దగ్గర వున్నాను. ఒకరోజు రాత్రి బాబా నన్ను పిలిచి ఒక నెల రోజులు రాత్రిపూట బాబా ప్రక్కనే కాపలావుండేందుకు ఎవరైనా యువకుడు వుంటే చూడమని చెప్పారు.

నేను బాబా చెప్పినట్లు వెదకటం ప్రారంభించాను. ఒక గొప్ప దనవంతుని బిడ్డను చూసి అతనితో బాబావారి పని గురించి ప్రస్తావించాను.

అతను వెంటనే కోపంగా నీలాంటి వాళ్ళను నౌకర్లుగా మా ఇంట్లో నియమించుకోగలను - ఏమనుకున్నావ్ అన్నట్లు నన్ను హెచ్చరించాడు. నేను బాబా దగ్గర ఎలాంటి పని వుంటుంది? ఎలా నడుచుకోవాలి? ఇతరత్రా అంతా చెప్పాను. ఇంతలో ఆ కుర్రాడు వాళ్ళ నాయనకు పరిచయం చేశాడు.

అతని తండ్రి మరింతగా కోపోద్రిక్తుడై-ఏమనుకున్నావ్? ఎవరనుకుంటున్నావ్? నిన్నూ, నీ గురువుగార్ని ఇద్దరికీ జీతాలు ఇయ్యగలనని, జాగ్రత్తగా ఉండమని నన్ను హెచ్చరించాడు.

జరిగిన సంగతంతా బాబాకి చెప్పాను. ఆ కుర్రాడిని చూడ్డానికై బాబా నాతో బయటకు వచ్చారు. ఓ ఐదు నిముషాలు ఆ కుర్రాడిని దూరం నుండే చూశారు.

ఆ తర్వాత పద, పద నా పనయిపోయిందన్నారు. ఇక ఆ కుర్రాడి జోలికి వెళ్ళొద్దన్నారు.





## ఆత్మహత్య చేసుకున్నాను

అది 1954 ఏప్రిల్ మాసం. బాబా మహాబళేశ్వర్‌లోని ఆఘాఖాన్ ప్యాలెస్‌లో వున్నారు. ఓ రోజున బాబా కోసం ఉదయాన్నే స్నానం కోసం వేడినీళ్ళు ఏర్పాటుచేయ్యాలి. నా అజాగ్రత్త వల్ల ఆ వేడినీళ్ళు చాలా వేడిగా ఉన్నాయి. బాబా స్నానానికై వాడే వేడి కంటే కూడా కాస్తంత ఎక్కువ మోతాదులో వేడిగా వున్నాయి. స్నానానికై వెళ్ళిన బాబా ఆ వేడినీళ్ళు చూసి నాపై కోపానికి వచ్చారు. తీవ్రంగా చివాట్లు పెట్టారు. తీవ్రంగా తిట్టారు. పనికిమాలిన వాడినన్నారు. తన దగ్గర ఉండటం వృధా అన్నారు.

ఇక్కడ్నుంచి వెళ్ళిపోవచ్చు గదా? అని గదమాయించారు. బ్రతికుండే కంటే చచ్చిపోవచ్చు కదా! నేను ఛస్తే తనకెంతో ఆనందం అన్నారు.

ఓ ఇలా, ఒకటా-రెండా? అనేక మాటలు కోపంతో అన్నారు. ఆ రోజంతా బాబా కోపంగానే వున్నారు. ఆ రోజు మధ్యాహ్నం 4 గంటలకు మరోసారి, నన్ను చంపేయాలని ఎవరూ ప్రయత్నించకుండా, నీవే చస్తే బాగుండేది కదా! అన్నారు.

దాంతో నాలో బధబాగ్ని రాజుకుంది. దుఖం కట్టలు తెంచుకుంది.బాబా మాటలూ నిజమే కదా! చస్తేనే బాగుంటుందని ఒక నిర్ణయానికి వచ్చేశాను.

ఆ రోజుల్లో ఒకసారి నిద్ర పట్టకుంటే డా॥ గోహెర్ రోజుకొకటి చొప్పున వేసుకోమని నిద్ర మాత్రలు ఇచ్చింది. ఆ సమయంలో బాబా అక్కడే వుండి, రోజూ వచ్చి ఇబ్బంది పెట్టేకంటే మొత్తం 25 మాత్రలున్న ఆ సీసాని ఇచ్చేయమని బాబానే డా॥ గోహెర్‌తో అన్నారు. నా మనస్సు బాగాలేదు. ఎలాగూ చనిపోవాలని నిర్ణయించుకున్నాను, బొంబాయి పాయింట్ అనే ఎత్తైన ఏకాంత ప్రదేశానికి వెళ్లాను. అక్కడ్నుంచి క్రిందకు దూకి చచ్చిపోవాలనుకున్నాను. కానీ, అలా చేయడం వల్ల చావకుండా, కాళ్ళూ చేతులూ విరిగితే బ్రతుకు బహు నరకం అవుతుందని ఆ ఆలోచనకు స్వస్తి పలికాను. ముందుగా నిద్ర మాత్రలు మింగేసి ఆ తర్వాత అక్కడ్నుంచి క్రిందకు దూకాలని నిర్ణయించుకున్నాను.

ఆ తర్వాత సీసాలో వున్న మొత్తం నిద్ర మాత్రలన్నీ నీళ్ళతో మింగేశాను. ఓ 20 మాత్రలుండొచ్చు. బొంబాయి పాయింట్ కేసి వెళ్దామని ముందుకు వెళ్తుంటే బాబా మండలి సభ్యుడు విష్ణు మాస్టర్ నా ఎదురుబడ్డాడు. నన్ను బాబా పిలుస్తున్నారని విష్ణు చెప్పాడు. చేసేది ఏమీ లేక, అతి కష్టంపై బాబా దగ్గరకు వెళ్ళాను. నడవలేని స్థితిలో వున్నాను. నిద్ర ముంచుకొస్తోంది. ఐనా ఏం చేయ్యాలి. బాబా ఎదుట నిలుచున్నాను. బాబా మండలి సభ్యులు అందరూ ఆయన చుట్టూతా కూర్చుని వున్నారు. ముంబాయి నుండి నారిమన్ దాదా ఛాంజీ మామిడి పళ్ళు తెచ్చాడు. ఆ పళ్ళను బాబా తలా రెండు చొప్పున అందరికీ పంచారు. మామిడి పళ్ళపై వున్న తొక్కతో సహా నన్ను బాబా తినేయమన్నారు. పళ్ళు బాగా పచ్చిగా వున్నాయని బాబాతో అన్నాను. ఐతే ముక్కలు

చేసుకుని తినమన్నారు. నేను అలాగే ఒకటి రెండు ముక్కలు నోట్లో వేసుకున్నానో లేదో – భళ్ళున నోట్లోంచి వాంతులయ్యాయి. అలా వాంతితో పాటు కొన్ని నిద్ర బిళ్ళలు కూడా పొట్టలోంచి బయటకొచ్చేశాయి. ఆ స్థితిలో అక్కడ నిలబడలేకపోయాను. నీరసంగా వుంది. అదే సమయంలో బాగా మత్తుగా వుంది. ఇది ఇలా వుండగా బాబా అక్కడ్నుంచి లేచి వెళ్ళిపోతూ – రాత్రి 7 గంటలకు యథాప్రకారం డ్యూటీకి వచ్చేయ్! అని చెప్పి తన గదికేసి వెళ్ళిపోయారు. ఆరోజు రాత్రి కాపలా డ్యూటీకెళ్ళినప్పుడు – బాబా నన్ను చూసి ఏమయింది! అలాగున్నావేమన్నారు. నేనేం మాట్లాడలేదు.

ఐనా కూడా – బాబా రెట్టించి ఇదే ప్రశ్న పలుసార్లు అడుగుతుంటే జరిగిన సంగతంతా చెప్పేయ్యాల్సివచ్చింది. నిద్ర మాత్రలు మింగానని ఒప్పుకున్నాను. ఎన్ని మాత్రలు తిన్నావని అడిగారు. ఓ 20 మాత్రలుండొచ్చని చెప్పాను బాబా కోపంతో చప్పట్లు కొట్టి, డా॥ గోహెర్ కోసం కబురు చేశారు. డా॥ గోహెర్‌కు నా గురించి చెప్పి తగిన మందులు ఇమ్మన్నారు. ఆరంజి సోడా తెప్పించి దాన్ని త్రాగమని ఇచ్చారు. అలాగే ఏవో రెండు మందు గోళీలు బాబా ఇచ్చారు.

మహాబళేశ్వర్ రోజుల్లో బాబా రోజూ సోడా త్రాగేవారు. ఆరోజున బాబా సోడా సగభాగమే త్రాగి వుంచారు. మిగిలిన సగాన్ని నాకిచ్చి త్రాగమన్నారు. ఆ తర్వాత తన మంచంపై కూర్చోమని, పాదాలు పట్టమన్నారు. నాకెంతో నీరసంగా వుంది. కూర్చోలేకున్నాను. ఎలాగో బాబా పాదాలు రాత్రి 8.30 నుండి దాదాపు తెల్లవారు ఝామున 4 గంటల దాకా పడుతూ వున్నాను. సేవక్ కొత్వాల్ తన డ్యూటీ ప్రకారం తెలతెలవారుతుండగా 4.30 నిముషాలకు వచ్చాడు. బాబా సేవక్ కొత్వాల్‌ను నాతోపాటు నా గది దాకా తోడుగా వెళ్ళి, నన్ను పడుకోబెట్టి, దుప్పటి కప్పి రమ్మనమని చెప్పారు. బాగా నిద్రపొమ్మనమని, సేద తీరమని చెప్పారు.

అంతేకాదు నా గదికి బయట నుండి గడియపెట్టి లోపల పడుకోమన్నారు. దానివల్ల ఎవరూ డిస్టర్బ్ చేయరన్నారు. ఆ రోజు సాయంత్రం 6.30 దాకా మంచి నిద్రపోయాను. సాయంత్రం డా॥ నీలూ వచ్చి నన్ను నిద్ర లేపాడు. అంతసేపు ఎలా నిద్రపోయానని అందరూ ఆశ్చర్యపడ్డారు.

సాయంత్రం టీ త్రాగాక బాబా గదివైపు వెళ్ళాను. బాబా మండలి హాలుకేసి వస్తున్నారు. నాకేమయిందో అడగమని – బాబా మండలివారితో అన్నారు. నానోట మాట పెగల్లేదు. స్థానువులా వుండిపోయాను. ఎందుకు ఆత్మహత్య చేసుకోవాలనుకున్నావ్? అని బాబా ఎన్నోసార్లు రెట్టించి అడిగారు. చివరాఖరకు, నెమ్మదిగా అంతక్రితం బాబా కోపాన్ని, ఆయన అన్న మాటలు గుర్తుచేసి, నిన్ను వదిలి వుండలేను. అందుకే చనిపోవాలని నిర్ణయించుకున్నానని చెప్పాను. దాంతో బాబా ప్రేమగా ముద్దాడారు. గట్టి ఆలింగనం ఇచ్చారు. ఇలాంటి పని భవిష్యత్తులో ఎన్నడూ చేయనని వాగ్దానం చేయమన్నారు. బాబా





మాటలు సామాన్యులకు అర్థం కావు. ఆనాడు బాబా నాపట్ల ఎందుకు అలా కరుకుగా వ్యవహరించారో! నాలోని చెడు సంస్కారాల తొలగింపుకోసం ఆయన అలా మాట్లాడివుంటారని నాకా దరిమిలా తెలిసొచ్చింది.

## బాబాని వదిలి వెళ్ళిపోవాల్సివచ్చింది

ఆగస్టు 1955లో నేను బాబాతోపాటు సతారాలో వున్నాను. నాదారిలో ఆడపిల్లల స్కూలు వుంది. ఆ స్కూల్లోని ఒక అమ్మాయి బాబా గురించిన పుస్తకం ఒకటి మరాఠీలో వున్నది ఇవ్వమంది. నేనలాగే ఇచ్చాను. కొంతమంది అమ్మాయిలు నేను ఆ అమ్మాయికి పుస్తకం ఇవ్వడం చూసి ఆటపట్టించాలనుకున్నారు. ఆ అమ్మాయికి నాపేరున మరాఠీలో ఒక ప్రేమలేఖ ఇచ్చారు. ఇదంతా నేనే చేశానని స్కూలు టీచర్లు నాపై బాబాకు ఫిర్యాదు చేశారు. నాకు మరాఠీ రాదు. అలాంటిది నేను మరాఠీలో ప్రేమలేఖ రాసే అవకాశమే లేదని బాబా వారితో చెప్పారు. ఏమయినప్పటికీ కృష్ణుడు ఎలాంటి తప్పు చేయకపోయినా, మీరందరూ అతడ్ని అనుమానిస్తున్నారు కాబట్టి, నేను అతడ్ని ఇక ఇంటికి పంపివేస్తానని ప్రకటించారు. ఆ తర్వాత బాబా నాతో మాట్లాడుతూ ఏదో జరిగిపోయింది. చాలా విచారకరం. దీని ప్రభావం నాపై కూడా వుంటుంది. గావున, నీవు కొన్నాళ్ళు నన్ను వదిలిపెట్టి ఎక్కడికైనా వెళ్ళమని ఆదేశించారు. బాబా నిర్ణయం విని నేను కఠిన శిలగా నిల్చుండిపోయాను. ఒక్క క్షణం అసలు బాబా భగవంతుడేనా అనే అనుమానం నాలో మరలా రేకెత్తింది. ఏడుస్తూ నిల్చున్నాను. బాబా నన్ను వెళ్ళిపొమ్మనడం సబబు కాదన్నాను.

ఈ విషయంలో నేను అమాయకుడినన్న విషయం నీకు తెలిసి కూడా నన్ను ఇక్కడ్నుంచి పంపించేస్తావా? అన్నాను.

అవును. నీకు రామాయణం కథ తెలుసుకదా. సీతమ్మవారు ఎలాంటి తప్పు చేయలేదని తెలిసి కూడా రాముడు ఆమెని అడవికి పంపివేశాడు. అలాగే నీవు ఎలాంటి తప్పు చేయలేదని తెలిసినా కూడా, నిన్ను కొన్ని కారణాల వల్ల పంపిస్తున్నానన్నారు. నీపై నా 'నజరు' ఎప్పుడూ వుంటుందని అభయమిచ్చారు. నేను ఎల్లవేళలా నీకు సహాయం చేస్తానని భరోసా ఇచ్చారు.

## రెండవసారి ఆత్మహత్య

సతారాలోని బాబా ఆశ్రమం నన్ను బయటకు పంపివేశాక నేరుగా ముంబాయికి వచ్చాను. ముంబాయిలో ఎక్కడ, ఎంత వెదికినా ఉద్యోగం దొరకలేదు. నానా అవస్థలు పడ్డాను. జేబులో చిల్లుకాణీ లేదు. ఇక బ్రతకడం వ్యర్థం అనుకున్నాను. చచ్చిపోవాలని స్థిర నిర్ణయానికి వచ్చాను.ముంబాయికి 40 కి.మీ. దూరంలో వజ్రేశ్వరి అనే ప్రాంతం. చుట్టూ ఎతైన కొండల ప్రాంతంలో ఉంది. ఏదైనా ఓ కొడపైకి ఎక్కి క్రిందికి దూకేద్దామని

నిశ్చయించుకున్నాను. సాయత్రం కాస్త చీకటి పడ్డాక ఆ చీకటిలోనే కొండపై నుండి దూకేయ్యాలన్నది నా ఆలోచన. రాత్రయ్యింది. బాగా చీకటిగా ఉంది. పైనుండి దూకేద్దామని నాలుగైదు అడుగులు ముందుకు వేయగానే, ఎవరో గట్టిగా చప్పట్లు కొట్టినట్లు వినిపించింది. తల వెనక్కి తిప్పి చూస్తే బాబా నాకేసి చూస్తూ నిలబడి వున్నారు. అలా బాబాని చూడగానే, అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోయాను. నాకేమయ్యిందో నాకు తెలియదు కానీ, ఆ రాత్రంతా ఒంటరిగా కొండపైన నేనొక్కడినే అలా పడుకున్నాను. నేను కళ్ళు తెరచి చూసేసరికి భళ్ళున తెల్లారింది. అప్పుడు ఉదయం 8 గంటలు అని తెలిసింది. బాబా నాపై తన నజర్ ఎల్లవేళలా ఉందని అభయమిచ్చిన విషయం అప్పుడు గుర్తుకొచ్చింది. బాబా ఇచ్ఛ లేకుండా నా ప్రాణాలు కూడా నేను తీసుకోలేను. నా చావు నా చేతుల్లో లేదని అర్థమయింది. క్రమేణా నా బాధలు కష్టాలు ఆలోచనలు దూరమయ్యాయి.

## పూనేలో బాబా దర్శనం

అది 1956వ సంవత్సరం. ఏ నెలనో ఇదమిద్ధంగా గుర్తులేదు. మెహెర్‌బాబా పూనేలో దర్శనం ఇస్తున్నారు. నేను ఆ దర్శన కార్యక్రమానికి పూనే వెళ్ళాను. భావూజీ నన్ను చూసి, ఇన్నాళ్లూ ఎక్కడ, ఎలా వున్నావని కుశల ప్రశ్నలు అడిగారు.

నేను గతంలో అనుభవించిన బాధ, చచ్చిపోవాలని వజ్రేశ్వరీ అమ్మవారి కొండ ప్రాంతానికి వెళ్ళడం, ఇత్యాది విషయాలన్నీ పూస గుచ్చినట్లు భావూజీకి అంతా చెప్పాను.

భావూజీ అంతా విని ఆశ్చర్యపడ్డారు. ఆదరిమిలా, బాబా సమక్షంలో జరిగిన ఒక విశేష సంఘటన భావూ ఇలా చెప్పారు. ఒక రోజున మధ్యాహ్నం ఉన్నట్లుండి బాబా ముంబాయిలో నా అడ్రస్సు కనుక్కోమన్నారు. అప్పట్లో నా అడ్రస్సు మెహెరాబాద్‌లో ఎవరికీ తెలియదు. ఒక అర్జెంట్ టెలిగ్రాం నాకు పంపాలని బాబా భావూతో అన్నారు. నా అడ్రస్సు దొరకని పక్షంలో కేరాఫ్ ప్రెసిడెంట్, అవతార్ మెహెర్‌బాబా సెంటర్, ముంబాయికి పంపాలని నిర్ణయించారు. నాకు పంపాల్సిన టెలిగ్రాంని భావూకి ఇలా చెప్పారు.

ఇది చాలా అర్జంట్. వెంటనే టెలిగ్రాం పంపమన్నారు. ఐతే ప్రతిరోజూ అహ్మద్‌నగర్‌కు టపాలు తీసుకెళ్ళే కుర్రాడు అప్పుడే మెహెరాబాద్ నుండి వెళ్ళాడు. అహ్మద్‌నగర్‌కు టెలిగ్రాం తీసుకెళ్ళేందుకు ప్రస్తుతం ఎవరూ లేరని, టపాలు తీసుకెళ్ళే కుర్రాడు కాస్తా వెళ్ళిపోయాడని బాబాతో భావూ చెప్పారు. దాంతో బాబాకు చాలా కోపం వచ్చింది.

ఐతే టెలిగ్రాం పంపలేమని చెబుతున్నావా? అని బాబా భావూజీపై చికాకు పడ్డారు. ఇది చాలా అర్జంట్ అని చెప్పాను. మరొకరెవరి చేతనైనా పంపించాల్సింది అని భావూని చీవాట్లు పెడుతూ రాసిన ఆ టెలిగ్రాం కాగితాన్ని బాబా ముక్కలు ముక్కలుగా చింపివేశారు.





ఆ తర్వాత భావూజీని తిడుతూ మరో టెలిగ్రాం రాసుకోమన్నారు.

ఇదంతా రాయడం పూర్తయ్యేసరికి మెహెరాబాద్‌లో వున్న రెండవ కుర్రాడు కాస్తా ఏదో పనిమీద బయటకు వెళ్ళిపోయాడు. ఈ విషయం బాబా తెలుసుకుని భావూజీని ఎడాపెడా తిట్టారు. చాలా ప్రత్యేక పరిస్థితుల్లో పంపుతున్న ఆ టెలిగ్రాంని తక్షణం ఎలా పంపాలో నీకు ఆలోచన లేదు. నీ మీద ఆధారపడకూడదు. నిన్ను నమ్మకూడదు. నీకు ఏం చెప్పినా అర్థం కాదు. ఇలా అనేక మాటల తూటాలతో బాబా భావూజీని సుమారు 2 గంటల పాటు చీవాట్లు పెట్టారు. ఆ తర్వాత బాబా కాస్త నడుం వాల్చారు. విశ్రాంతి తీసుకున్నారు. సాయంత్రం 7 గంటలకు బాబా ప్రశాంత వదనంతో కన్పించారు.

ఆ తర్వాత చల్లని రోజ్ వాటర్ కొద్దిగా త్రాగారు. ఆ దరిమిలా బాబా చాలా ప్రశాంతంగా కన్పించారు. బాబా తన మొదటి టెలిగ్రాం మధ్యాహ్నం 3 గంటల సమయంలో రాశారు. నేను ఆ సమయంలో ముంబాయి నుండి వజ్రేశ్వరీ మాత ఆలయం కేసి బయలుదేరాను. బాబా కంగారు పడి భావూజీని కోప్పడిన సమయంలోనే ఆ కొండపై బాబా ప్రత్యక్షమయిన సమయం అని సరిపోల్చుకున్నాను. బాబా ఆ మాదిరిగా తన ప్రేమ నాపై కురిపించి నన్ను రక్షించారు. ఆపన్నులకు ఆయన ఆదుకునే రీతి అనేక విధాలుగా ఉంటుంది సుమా! అని నాయర్ వివరించారు.

## నావీలో ఉద్యోగం

నేను ముంబాయిలో వుండగా నౌకాదళంలో, సెక్యూరిటీ విభాగంలో నౌకరీ లభించింది. నేను మెహెర్‌బాబా ప్రేమికుడనని నా ఉద్యోగం కోసం నేను వెళ్ళిన సమయంలో చెప్పుకున్నాను. నాకు తగినంత విద్యార్హతలు లేకున్నా నన్ను ఇంటర్వ్యూ చేసిన వాళ్ళకు మెహెర్‌బాబా గురించి తెలిసుండటంతో నాకు ఉద్యోగం ఇచ్చారు. ఆ తర్వాత అదే ఉద్యోగంలో ప్రమోషన్ కూడా ఇచ్చారు. అక్కడ అలా ఉద్యోగం చేసుకుంటూ, మెహెర్‌బాబా దర్శనార్థం వచ్చిపోతున్నాను. 1955–1968 మధ్యకాలంలో బాబా దర్శనం చాలాసార్లు చేసుకున్నాను. నేను ఉద్యోగం నుంచి రిటైరయ్యాక తన దగ్గరకు రమ్మనమని బాబా ఆదేశించారు. అదేమాదిరిగా 1983లో నేవీలో రిటైరయ్యాక మెహెరాబాద్‌కు నేరుగా వచ్చాను. డి-హాస్టల్‌లో కిచెన్, స్టోరు పనులు నిర్విఘ్నంగా 18 సంవత్సరాలు నిర్వహించాను.

ఐతే, కృష్ణనాయర్ భార్య చనిపోయాక, 2001లో ఆయన కుమార్తె నాయర్‌ని కేరళలోని స్వగ్రామం తీసుకెళ్ళింది.

కృష్ణనాయర్ 01.10.2003లో స్వరాష్ట్రంలోనే బాబాలో ఐక్యమయ్యారు. అవతారునితో కృష్ణ నాయర్ సాంగత్యం 62 సంవత్సరాలపైగా వుంది. కృష్ణనాయర్ డి-హాస్టలులో ఉన్న సమయంలోనే తన గురించిన అనేక విషయాలు శ్రీ అన్నా ఖండాలేకు స్వయంగా వివరించారు. అన్నాజీ ఆ విషయాలను నేటితరం కోసం గ్రంథస్తం చేశారు...

❀

## అపురూపమైన సి.డిల రూపకల్పన

బాబా సందేశాలపై పేరెన్నికగన్న బాబా ప్రేమికుల ఉపన్యాసాలు, వీడియో క్యాసెట్లు, ఎవరివద్దనైనా వుంటే అందజేయవల్సింగిగా శ్రీ సుధాకర్ (9030833930) మచిలీపట్నం కోరుతున్నారు. అలా అందుకున్న సిడిలను తిరిగి ఆధునిక సాంకేతిక పద్ధతులలో రికార్డు చేయించి, ఆ డి.వి.డి / సి.డి లను పలు బాబా సెంటర్లకు ఉచితంగా అందజేయాలని ప్రతిపాదించినట్లు ఆయన తెలిపారు.

## విశాఖపట్నం బాబా సెంటర్ నూతన కార్యవర్గం



**విశాఖపట్నం బాబా సెంటర్ నూతన కార్యవర్గం ఎంపిక 2012 జూలై ఒకటో తేదీన జరిగింది.**

**ఆ వివరాలు:**

1. జి. మోహన్‌రావు, అధ్యక్షులు,
2. ఎల్.వి.ఆర్. మూర్తి, కార్యదర్శి,
3. కె. మెహెర్ కుమార్, కోశాధికారి,
4. వి.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు,
5. వి.రవికుమార్, సహాయ కార్యదర్శిగా ఎంపికయినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, ఇకపై అన్ని ఉత్తర ప్రత్యుత్తరాలను శ్రీ మోహన్‌రావు, ఎఫ్3 - స్వాతి నివాస్, డోర్.నెం. 49-35-28/6, ఎన్.జి.జి.ఓ కాలనీ, అక్కాయపాలెం, విశాఖపట్నం-16 సంప్రదించవల్సిందని కోరుతున్నారు.

## కాదిక నాగ సుశీల బాబాలో ఐక్యం

శ్రీ సాంబమూర్తి గారి భార్య శ్రీమతి కాదిక నాగ సుశీల, మచిలీపట్నం, 21.6.2012 గురువారం రాత్రి 1.05 సమయంలో బాబాలో ఐక్యమయినట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు.

## సంస్మరణం

ఇటీవల బాబాలో ఐక్యయయిన శ్రీ కొండేపల్లి వెంకటాచారి, తాడేపల్లిగూడెం వారి సంస్మరణార్థం స్థానిక సుబ్బారావు పేట సెంటర్ ఆధ్వర్యంలో 14.6.2012న ఉ. 8.30 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రేమిక సహవాస్ నిర్వహించినట్లు కార్యదర్శి శ్రీ కె.వి. నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, శ్రీమతి బాలగోపాల గోవిందమ్మ గారు, శ్రీ యు. బాపిరాజు (ఏలూరు), డా॥ హరి శ్రీనివాస్, శ్రీమతి మెహెర్ మణి తదితరులు ప్రసంగించారని శ్రీ నాయుడు తెలిపారు.





## మహేశ్వరరావు బాబాలో ఐక్యం



బాబా ప్రేమికులు శ్రీ నిమ్మగడ్డ మహేశ్వరరావు (70), హైదరాబాద్ 30.06.2012 మ. 2 గంటల ప్రాంతంలో బాబాలో ఐక్యమయ్యారు. జూలై ఒకటిన ఉదయం 10 గంటల ప్రాంతంలో సికింద్రాబాద్‌లోని అల్వాల్‌లో బాబా నామధున్, ప్రార్థనల అనంతరం ఆయన ముందుగా కోరుకున్నట్లు ఎలాంటి కర్మకాండలు లేకుండా అంత్యక్రియలు నిర్వహించారు.

శ్రీ మహేశ్వరరావు నిరంతరం బాబా నామస్మరణలో గడిపారు. నలుగురు కలిసి మాట్లాడే పిచ్చాపాటీలో కూడా బాబా సందేశాలు గుర్తుచేసుకుంటూ నిరాడంబరంగా గడిపిన ధన్యజీవి. ఆయన కొంతకాలంగా అస్వస్థతతో ఉన్నారు. మెహెర్‌బాబా పత్రికకు సంబంధించి ఆయన్ని ఎలాంటి సహాయం అడిగినా దాన్నొక బాధ్యతగా పూర్తిచేశేవారు. పత్రిక హెల్ప్‌లైన్‌లో ప్రముఖ సహాయకుడిగా పాఠకులందరికీ ఆయన చిరపరిచితుడు. నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా, సూటిగా వ్యవహరించే అరుదైన వ్యక్తిత్వం శ్రీ మహేశ్వరరావు గారిది. బాబా ప్రేమికులకు ఆతిధ్యం ఇవ్వడంలో ఆయన తనదైన తృప్తిపొందేవాడు. మెహెర్‌బాబా సాహిత్యానికి సంబంధించి అనేక తెలుగు, ఇంగ్లీషు గ్రంధాలు, పత్రికలు తెప్పించుకోవడం, వాటన్నిటిని ఒక క్రమపద్ధతిలో బధ్రపరచడం ఆయన విశిష్ట వ్యక్తిత్వం అని పలువురి అభిప్రాయపడతారు. శ్రీ మహేశ్వరరావు ఒక విలక్షణమైన బాబా ప్రేమికుడు. నిబద్ధతగల నిస్వార్ధ కార్యకర్త. ఆయన మరణం హైదరాబాద్ బాబా సెంటర్‌కు, ముఖ్యంగా **మెహెర్‌బాబా** మాసపత్రిక నిర్వహణలో ఒక తీరని లోటు.

## చిలుకూరు సత్యవతి (84)



శ్రీమతి చిలుకూరు సత్యవతి (84) కాకినాడ బాబా ప్రేమికురాలు స్వల్ప అస్వస్థతతో 2012 జూన్ 25 ఉదయం 8.25 నిముషాలకు బాబాలో ఐక్యమయ్యారని ఆమె కుటుంబసభ్యులు తెలిపారు. 1969లో బాబా పరిధిలోకి వచ్చిననాటినుండి ఆమె ప్రతిఏడాది మెహెరాబాద్ అమరతిథికి వెళ్ళి అవతారుడిని దర్శించుకున్నారని, నిరంతరం బాబానామస్మరణలో ఆమె గడిపేవారని ఆమె కుమారుడు శ్రీ మురళి తెలిపారు.



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్, వాల్యూం-3 (1925-29) - తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ

*(గత సంచిక తరువాయి)*

మీరేమంటారని రమ్జూ, ఛాన్జీలని అడిగారు.

ఈ పత్రిక ఎలా వుండాలంటావ్ అని దస్తూర్‌ని ప్రశ్నించారు.

ముగ్గురి మాటా విన్న తర్వాత తమ అభిప్రాయం చెప్పారు.

ప్రచురణ కార్యమైన వ్యాసాలని ఎంపిక చేసే బాధ్యతని ఓ కమిటీపై పెడదామన్నారు.

'కమిటీనా? కమిటీ ఎందుకు' అని దస్తూర్ ప్రశ్నించాడు. బాబా నామవ్యాప్తి యధాశక్తి చేయాలన్న నా కోర్కెని నీరు కారుస్తున్నారని అగ్గి గుగ్గిల మయ్యాడు. మెహెర్ మెసేజ్ ఒక్కటే చాలు. ఇంకో పత్రిక అనవసరమన్నాడు.

మెహెర్ మెసేజ్‌కి దస్తూర్ గారు సంపాదకులు.

అందులో తప్పులు దొర్లటం లేదా!

దొర్లుతున్నాయి.

కానీ తప్పులు ఎత్తి చూపిస్తే సంపాదకులవారికి కోపం వస్తుంది.

అయ్యో పొరపాటు జరిగిందే అన్న భావన కించిత్ కూడా కనపడదు ఆయనలో.

బాబావారి సమక్షంలోనూ దస్తూరి గారి ధోరణి ఇంతే.

'మెహెర్ మెసేజ్' లో మొదటి వ్యాసంలోనే తప్పులు దొర్లాయని బాబావారే చెప్పారు.

తప్పులు లేకుండా చూడటానికే కమిటీ ప్రస్తావన తెచ్చానన్నారు.

అంతే, చిర్రున తారాజువ్వలా లేచాడు.

'బాబా.. మీరెప్పుడూ ఇంతే! నన్నే అంటారెప్పుడూ!

ఇదిగో ఈ రమ్జూ, ఛాన్జీల మాటే మీరు వింటారు.

నా మాట పట్టించుకోరు అన్నాడు.

అతని గొంతులో నిష్ఠూరంతో పాటు అసహనం, ఉడుకుమోతుతనం స్పష్టంగా విన్పించాయి.

బాబావారిలా స్పందించారు.

'నిజంగా నేను వాళ్ళిద్దరూ చెప్పినట్లు చేస్తున్నానని నువ్వు అనుకుంటే, సరే, ఇహ నువ్వు ఇక్కడ నాతో ఉండటం దండగ'.





చర్చ ముగిసింది.

దస్తూర్ తన గదికి వెళ్ళిపోయాడు.

అతని ప్రవర్తనకి రమ్జూ, ఛాన్జీ బాగా నొచ్చుకొన్నారు.

'మీరు బాధపడకండి. అతగాడిని తన ఇష్టం ప్రకారం చేయనీయండి' అని బాబావారికి చెప్పారు. 'మెహెర్ మెసేజ్' లో అభ్యంతరకర రచనలు పడతాయన్న బెంగవద్దు. ఈ సంగతిని చూసుకొంటాను. అభ్యంతరకర రచనలని అనుమతించను అని ధైర్యం చెప్పారు.

రమ్జూ రచన రుద్ధకంఠములు – రుధిరహృదయములకి శ్రీకారం ఈమధ్యనే జరిగింది. ప్రేమాశ్రమ పిల్లల ఆధ్యాత్మిక అనుభవాల సంగ్రహమే ఈ పుస్తకం.

పిల్లల్ని గుచ్చి గుచ్చి అడిగి, భోగట్టా సేకరించి గ్రంధస్థం చేశాడు. తనవంతు పని పూర్తయింది. ఇహ టైపుచేసి, ప్రచురణకి పంపడమే తరువాయి. ఆఘూ ఆలీని తీసుకువెళ్ళిన రోజున టైపింగ్ పని మొదలైంది.

నవంబరు నెల చలి బాగా వుందని అనుకొన్నాము కదా. ప్రేమాశ్రమం పిల్లలు కొందరికి దగ్గుపట్టుకొంది. బాబా బైదుల్‌ని ఆస్పత్రికి వెళ్ళి దగ్గుమందు సీసా తెమ్మన్నారు. బాబా అనటమే తరువాయి బైదుల్ ఆస్పత్రికి పరుగెత్తాడు. అక్కడ ఎదురుగా కనిపిస్తున్న ద్రావకం సీసా తెచ్చాడు. బాబావారా సీసాని కాసేపు అటూ ఇటూ త్రిప్పిచూసి, బైదుల్ చేతిలో పెట్టారు.

ఆస్పత్రి అలమారాలో జాగ్రత్తగా పెట్టిరా అని పురమాయించారు. ఎదురు ప్రశ్న వేయకుండా ఆస్పత్రి దారి పట్టాడు. అక్కడ అలమారలో పెడుతూ సీసాపై పేరు చదివాడు. అవాక్కయ్యాడు. అమ్మో! ఈ మందు పిల్లలు త్రాగి వుంటేనా? ఎంత ప్రమాదం ఎంతలో తప్పింది! బాబా! సర్వాంతర్యామి! నీ దయవల్ల ఘోర ప్రమాదం తప్పింది. నా తప్పుని క్షమించు దేవదేవా అని మనస్సులోనే ప్రార్థించాడు.

ఇంతకూ ఏమయిందంటే బైదుల్ తెచ్చింది దగ్గు మందు కాదు.

ఐయోడిన్ అది.

దెబ్బలకీ, పుండ్లకీ వాడే మందు అది. పుండుపై కొంచెం చుక్క వేయగానే భగ్గున మండుతుంది. హడావుడిలో సీసా రంగు చూశాడు తప్ప, సీసా పేరు చదవ లేదు

బైదుల్. రోగిష్టివాళ్ళ జాబితాలో పాద్రి చేరాడు. మెహెర్జీ కూడా నీతోపాటే నేను అంటూ మంచం ఎక్కాడు. నవంబరు 25న మెహెర్జీ ఎంగిలి పడలేదు. నోటికి ఏదీ హితవు అనిపించలేదు. పుల్లపుల్లగా తీయగా వుండే దానిమ్మరసమో, నారింజరసమో, కనీసం ఆపిల్ పళ్ళ రసమో త్రాగాలనిపించింది. కబులీ దానిమ్మరసమయితే మరీ బాగుంటుందనుకొన్నాడు.

మనస్సులో మాట ఎవరితోనైనా అంటే క్షణాల్లో పళ్ళరసం తీసుకువచ్చేవారే, కానీ మన స్నేహితుడు ఆ పని చేయలేదు. మొహమాటం అడ్డంవచ్చింది.

మొహమాట పడి ఎవరిదగ్గరైనా మనస్సులో మాట చెప్పలేకపోవచ్చుకానీ అమ్మకి చెప్పకుండానే తెలుస్తుంది బిడ్డ కోరిక. అమ్మని మించిన అమ్మ ప్రపంచానికే అమ్మ అయిన దేవుని సన్నిధానంలో వుంటున్న మెహెర్జీకి వచ్చిన కొదవేముంది?

నీ కోర్కె నాకు నువ్వు చెప్పాల్సిన పనిలేదు అన్నట్లు బాబావారే స్వయంగా బుట్టెడు పళ్ళతో మెహెర్జీ గదికి వచ్చారు.

ఆవేళ ఎవరో కాబుల్ దానిమ్మలు బాబాకు సమర్పించారు. వాటినీ మెహెర్జీ కోసం తెచ్చారీ యుగావతారుడు.

టోకాకి వీడ్కోలు రోజులు దగ్గరపడుతున్నాయి.

స్కూలు కోసం కట్టిన ఇళ్ళు, నివాస గృహాలు, విశ్రమ మందిరాలు వగైరాలు పడగొట్టేస్తున్నారు.

పాపం ఈ సంగతి తెలీని ప్రేమికలోకం, టోకా మెహెరాశ్రమ ప్రాశస్త్యాన్ని వేన్నోళ్ళ కొనియాడుతోంది. మెహెరాశ్రమంలో పిల్లల్ని చేర్పించమని విజ్ఞప్తి చేస్తోంది.

టోకా మూసేస్తున్నారని పత్రికల్లో చదివి ప్రేమికలోకం నిర్ఘాంతపోయింది.

బాబావారి దైవీ ప్రణాళిక తెలియదు లోకానికి.

బాబావారి ప్రతి చర్యకీ ఏదో ఒక విశిష్టత వుంటుంది.

బాబావారి విశ్వకార్యక్రమం లోకకళ్యాణం కోసమే, మానవాళిని ఆధ్యాత్మిక పథోన్ముఖుల్ని చేయడం కోసమే మెహెరావతారణ జరిగింది. నవంబరు 26న నౌరోజీ, దాదా ఛాన్జీని పిలిచి, ఇక్కడివి అన్నీ పడగొట్టి ఆరలు, తలుపులు, తడికలు, వగైరా మెహెరాబాద్‌కి చేర్చమన్నారు. ఈ పురమాయింపు చేశాక బాబావారు, రుస్తుం కారు ఎక్కారు. నగర్ దారి పట్టారు. గుస్తాద్ గారు, అబ్దుల్లా గారు కూడా కారు ఎక్కారు. స్త్రీ మండలి మాత్రం వెంటనే బయలుదేరలేదు. వారు అక్కడే 29వ తేదీ వరకు వున్నారు. పురుషమండలి డిసెంబరు నాలుగున కదిలారు. బాబావారు వెనకే పిల్లలు, పెద్దలు ఎక్కిన ట్రాక్టరు బయలుదేరింది. పెట్టె బేడా కూడా ఆ ట్రాక్టరులోనే వేశారు. అందరికీ ఆవాళ్ళ బస అక్బర్ ప్రెస్‌లో. ఈ ఇల్లు ఎవరిదో తెలుసుకదా పాఠకమహాశయా. మన నౌసేర్వాన్ సాథాది. ఆయన కుటుంబం బాబాని సేవించి తరించింది.





ఒకరోజు ఉదయాన్నే సాథా మహాశయుడు వంటగదిలో అడుగుపెట్టాడు. మిగతావాళ్ళు లేచేలోగా అల్పాహారానికి ఏర్పాట్లు మొదలుపెట్టాడు. వారందరూ తినేది చపాతీలు. అందుకని గోధుమ పిండి కలిపి, చపాతీలు వత్తుతుంటే, చప్పుడైంది. వెనక్కి తిరిగి చూశాడు బాబా కనిపించారు. అన్ని చపాతీలు నువ్వు ఒక్కడివే ఎలా చేస్తావ్. నన్ను కూడా చేయనీయనీ అని బాబావారు అన్నారు.

నౌసేర్వాన్ నొచ్చుకొన్నాడు.

మేమందరం వుండగా మీకెందుకు ఈ కష్టం బాబా!

మీరు వెళ్ళి విశ్రాంతి తీసుకోండి.

క్షణంలో చాపాతీలు చేసి తీసుకువస్తాను అన్నాడు.

బాబావారు అతని మాట కొట్టేశారు.

నాకిదేమీ కొత్తకాదు.

రాత్రి, పగలు, రెండు పూటలా భోజనం రెడీ చేయడమే నాపని.

నేను భోజనం రెడీ చేయలేదనుకో యావత్తు ప్రపంచం ఆకలితో గంగిలెర్లు ఎత్తుతుంది. ఇంకో మాట చెప్పనా.

నేను అంతర్గతంగా ఆహారం అందిచడమే నాపని. సశరీర రూపంలో ఆహారం పెట్టడానికీ అవతరిస్తుంటాను అని నౌసేర్వాన్‌కు ఒక సృష్టి రహస్యం వెల్లడించారు.

నవంబరు 29వ తేదీ ఉదయాన్నే వారు పెద్ద ఆదీ కారులో టోకా చేరారు.

స్త్రీ మండలిని తీసుకొని మధ్యాహ్నాం రెండింటికి మెహెరాబాద్‌కి బయలుదేరారు. ఆవాళ్ళ నుంచి స్త్రీ మండలి మకాం పోస్టాఫీసు ఇంటిలో. బాబావారి బస కొండపైనే యధాప్రకారంగా వాటర్ ట్యాంకీని ఆనుకొన్న చిన్న గదిలో కొద్దిరోజులున్నారు. దరిమిలా తమ భవిష్యత్ సమాధి మందిరమైన గొయ్యి గదికి మారారు.

టోకా ఆశ్రమంలో ఏదీ శాశ్వత కట్టడం కాదు.

అన్నీ తాత్కాలిక ప్రాతిపదికన కట్టిన ఇళ్ళు, గదులే. వాటిని డిసెంబరు నాల్గవ తేదీ నాటికి పడగొట్టించారు. వెంటనే పురుషమండలి టోకాకి గుడ్ బై చెప్పింది. టోకా నిర్మానుష్యమైంది. అందరూ వెళ్ళిపోయారు. దేవ దేవుడు నడయాడిన పావనక్షేత్రమిది. ఇక్కడ మళ్ళీ ఎప్పటికీ ఆ వైభవం కనబడదు. కానీ వినిపిస్తుంది దేవ దేవుని వేణుగానం.

ఆ గానలహరి ఎప్పటికీ మత్తు ఎక్కిస్తుంది. యుగ యుగాలకీ దప్పిక తీరుస్తుంది. దేవ గానామృతంలో తరిస్తుంది ఆత్మ.

పావన నదుల సంగమంలో ఈదుతూ శాశ్వత అస్తిత్వపు తీరంపై తేలుతుంది.

గుల్మాయిని బాబావారు తమ ఆధ్యాత్మిక మాతగా అభివర్ణించారొకసారి. ఉపాసనీ మహరాజ్‌ని సేవించి,

ఆయన ఆదేశం మేరకు మెహెరుని దగ్గరకు వచ్చిన తల్లి ఆమె. తల్లితోపాటు ఇద్దరు

కొడుకులు – ఆదీ, రుస్తుం, కూతురు డాలీ కూడ బాబావారినే తమ ఆరాధ్య దైవంగా స్వీకరించారు. ప్రభు సేవకే జీవితాన్ని అంకితం చేసిన ధన్యులు వీరు ముగ్గురూ.

అయితే సరోష్ ఇరానీ గారికి అప్పట్లో బాబా వారంటే అంత ఇష్టత లేదు.

అంత అయిష్టతా లేదు.

భార్యా పిల్లలు బాబా దగ్గరకు వెడతానంటే వద్దన్న పాపాన పోలేదు.

మీ ఇష్టం వెళ్ళండని అనేవాడు.

ఇది ఆయన తండ్రికి నచ్చేది కాదు.

పెద్ద ఖైఖుస్రూగా నలుగురికీ చిరపరిచితుడైన ఆయనకి మెహెర్‌బాబా అంటే కించిత్ కోపం కూడా.

బాబావారి పేరు ఎత్తితేనే చిరుబుర్రులాడేవాడు.

ఎందుకు అంటారా అందుకూ కారణం వుంది.

బాబా పేరు చెప్పి మాకు ఎక్కడలేని కష్టాలు వచ్చాయనేవాడు.

ఏం మెహెర్‌బాబానో ఏమో!

ఈ మహానుభావుడు ఏ ముహూర్తాన మాకు ఎదురయ్యాడో అప్పటి నుంచీ మా వాళ్ళకి కష్టాలు తప్ప ఇంకేమీ మిగల్లేదు అనేవాడు నిష్ఠూరంగా.

ఒక్కమాటలో చెప్పాలంటే మెహెర్‌బాబా దర్శనం శుద్ధ దండగ అని ఆయన అభిప్రాయం.

మరి కొడుకు మెహెర్‌బాబాని దర్శించాడని తెలిసిందో అగ్గిగుగ్గిలమయ్యేవాడు.

పొరపాటున కలిశాడా? గ్రహపాటున కలిశాడా? కావాలనే వెళ్ళాడా? ఇవన్నీ ఆయనకి అనవసరం.

బాబా దగ్గరకి వద్దన్నాక ఎందుకు వెళ్ళావురా అని కొడుకుని నిలదీసేవాడు.

పాపం సరోష్ ఇరానీ గారు ఇటు తండ్రిని కాదనలేక అటు భార్యనీ నొప్పించలేక సతమతమయ్యేవాడు.

పెద్దాయన్ని బాధపెట్టటం ఎందుకులే అనుకొని బాబా దగ్గరకి వెడుతున్న సంగతి ఎవరికీ చెప్పేవాడు కాదు.

గుట్టుచప్పుడు కాకుండా మెహెరాబాద్‌కు వచ్చేవాడు.

దర్శనం అవుతూనే ఎవరికీ కనబడకుండా ఇంటికి వాపసు వెళ్ళేవాడు.

సరోష్ గారు తమ మెహెరాబాద్ యాత్రను ఎంత గోప్యంగా వుంచాలని ప్రయత్నించినా, తండ్రికి ఆ సంగతి తెలిసేది.

కొడుకు ఇంటికి రాగానే అక్షింతలు పడేవి.

నా గుట్టుని రట్టు చేస్తున్నది ఎవరబ్బా అని సరోష్ ఇరానీ మధనపడ్డాడు.

నా రాకపోకలపై ఎవరో కన్నేసి వుంచుతున్నారు.





నేను ఇంటికి తిరిగి చేరేలోగానే ఈ వార్తని నాన్నగారి చెవిని వేస్తున్నారన్న అనుమానం పట్టుకొంది.

సర్వాంతర్యామికి నిజం తెలియకపోతే కదా.

ఆయన జగన్నాటకంలో ఇదొక అంతర్నాటకం.

పాపం సరోష్ కష్టం చూసి అయ్యో అనిపించిందో ఏమో, బాబావారు జమాదారిని అడిగిచూడు నిజం తెలియవచ్చు అన్నారు.

ఆరంగావ్ నివాసి జమాదార్.

వయస్సు 39 ఏళ్ళు.

అతని పూర్తి పేరు – రూప్‌సింగ్ గణేష్ ఘోన్‌సడే.

గడుసు మనిషి కాదు. ఒట్టి అమాయకుడు.

సరోష్ నిలదీయగానే నిజం చెప్పేశాడు.

మీ నాన్నగారు చెప్పమన్నారు.

మీరు ఎప్పుడు వచ్చినా ఆ మాట తమ చెవిని వేయమన్నారు.

పెద్దాయన మాట కాదనలేకపోయాను అన్నాడు.

లెంపలు వేసుకొన్నాడు.

తప్పయింది క్షమించమంటే ఎవరైనా ఏం చేస్తారు.

పోనీలే, మళ్ళీ అలా చేయకు అంటారు.

అంతే చేశాడు సరోష్ గారు కూడా.

జమాదార్ నిజాయితీ బాబావారికీ నచ్చింది.

ఇక్కడే నా దగ్గరే మెహెరాబాద్‌లో వుండు అన్నారు.

నైట్ వాచ్‌మెన్ (రాత్రి కాపలాదారు) గా నియమించారు.

ఈ జమాదార్ అంతర్నాటకంతో సరోష్ ఇరానీగార్కి తండ్రితో సంబంధం తెగిపోయింది.

జమాదార్‌కి మాత్రం మెహెరాబాద్‌తో అనుబంధం పెరిగింది.

1925 నుంచి 45 సంవత్సరాలు మెహెర్‌ని సేవించి తరించాడు.

బాబావారు ఆర్నెల్లు టోకాలో ఉన్నప్పుడు కూడా జమాదార్ మెహెరాబాద్‌లో నైట్‌వాచ్‌మెన్‌గా పనిచేశాడు.

అప్పట్లో అతని డ్యూటీ కొండపైనే.

కొండపైన వున్న చిరాస్థి బాబావారి గొయ్యి గది.

దానిపై వున్న క్యాబిన్‌ని టోకాకి తరలించడం వల్ల, ఆ ప్రాంతాన్ని భద్రంగా కాపాడాల్సిన బాధ్యత జమాదార్ పైనే పడింది.

నిజాయితీగా, శ్రద్ధగా తన విధులని నిర్వహించాడు.

ఒంట్లో నలతగా వున్నా సరే డ్యూటీ మానేవాడు కాదు.

ఇతని భార్య పేరు భాగు.

భర్తకి తగ్గ భార్య.

నిజాయితీకి మారు పేరు.

అందుకనే కాబోసు, బాబావారు భాగును స్త్రీమండలికి చేదోడు వాదోడుగా వుండమన్నారు.

ఆమె సంతోషంతో తల వూపింది.

భార్యకీ మెహెరాబాద్‌లో పని దొరకడంతో జమాదార్ సంతోషించాడు.

ఇహ మళ్ళా సరోష్ ఇరానీ కథలోకి వస్తే, ఆరేళ్ళ క్రిందట అంటే 1922లో పూనాలో వున్నప్పుడు బాబావారొక వరం ఇచ్చారతనికి.

నిన్ను రాజుని చేస్తాను.

ధైర్యంగా వుండు.

దేన్ని గురించీ బాధపడకు అన్నారు.

రాజ్యం లేకుండా రాజునెలా అవుతాను అనుకొన్నాడో ఏమో తెలియదు కానీ సరోష్ గారు, భార్య పేరు చెప్పి బాబావారి మాటని నమ్మడం మొదలుపెట్టాడు.

అలా అని ఎదురు ప్రశ్న వేసేవాడు కాదు.

బాబావారు చెప్పింది వినేవాడు.

ఏపని చేయమంటే ఆపని చేసేవాడు.

ఫలానా వ్యాపారం చేయి అని బాబావారు అంటే తటపటాయించకుండా ఆ కొత్త వ్యాపారం మొదలుపెట్టేవాడు.

ఎప్పుడు ఏం చేయాలో నాచేతిలో ఏముంది కనుక అన్న అభిప్రాయం ఏర్పడింది అతనిలో.

సరే ఇంతకూ నిన్ను రాజుని చేస్తానన్న తర్వాత బాబావారు మంజిల్ – ఇ – మీమ్‌కి వెళ్ళి కొద్దిరోజులున్నారు.

అక్కడి నుంచి వచ్చాక, బాబావారు సరోష్‌ని పిలిచి, కార్ల రిపేర్లకి మంచి గిరాకీ వుంటుంది.

నగర్‌లో కార్ల షాపు పెట్టమన్నారు.

బాబావారి మాటకి ఎదురు చెప్పని సరోష్ వెంటనే కార్ల వ్యాపారానికి శ్రీకారం చుట్టాడు.

డబ్బుకి డబ్బు, పేరుకి పేరు రెండూ వచ్చాయి.

నగర్‌లో పరపతి పెరిగింది.

రాజకీయాల్లోకి పిలుపు వచ్చింది.

అక్కడా రాణించాడు.





నగర్ మేయర్‌గా ఎన్నికయ్యాడు.

ఆ హోదాలో నలుగురికీ సహాయపడ్డాడు.

నగరాభివృద్ధికి ఎంతో కృషి చేశాడు.

ఆ మంచితనంతో మేయర్‌గా ఒకసారా, రెండుసార్లా చాలాసార్లు ఎన్నికయ్యాడు.

మేయర్‌గా అన్నిసార్లు ఎన్నికైన వ్యక్తులు చాలా కొద్దిమంది.

ఆ కాలంలో మేయర్ అంటే నగరానికి రాజుగారే కదా.

ఈ వరమే బాబావారిచ్చింది.

ఇంతకీ చెప్పవచ్చేది ఏమిటీ అంతే, పలుకుబడి ఎంత పెరిగినా, సంఘంలో ఎంత గొప్ప హోదా తన పరమయినా సరోష్ ఇరానీలో మాత్రం మార్పు రాలేదు.

బాబావారిపై నమ్మకం సడలలేదు.

బాబావారు చెప్పిన పని చేయటం మానలేదు.

కొనవూపిరి వరకు గురువు ఆజ్ఞని తు.చ. తప్పకుండా పాటించాడీ ధన్యజీవి.

ఇహ మళ్ళీ వర్తమానంలోకి వస్తే.....

బాబావారు రోజూ గెడ్డం గీసుకోవటం లేదు.

ఎందువల్ల అంటే ఫలానా కారణం వల్ల అని తెలీదు.

బాబావారు గెడ్డం గీసుకోలేదు అంతే.

డిసెంబరు తొమ్మిదవ తేదీ నాటికి గెడ్డం బాగా మాసింది.

బాబావారి మొహాన్ని గెడ్డం కప్పేస్తోంది అని మధన పడుతున్నవారికి ఆవేళ కొత ఊరట దొరికింది.

రోజూలాగా, ఆవేళ కూడా పెండూ, బాబావారికి గెడ్డం గీస్తానన్నాడు.

గెడ్డం బాగా పెరిగింది బాబా!

నామాట కాదనకండి అన్నాడు పెండూ.

సరేనన్నారు బాబా.

వెంటనే గెడ్డం గీయటానికి ఏర్పాట్లు జరిగాయి.

పెండూ గడ్డానికి సబ్బు పట్టించాడు.

మీసం జోలికి వెళ్ళలేదు.

గుబురు మీసం బాబావారికి ఎప్పట్నించో అలవాటు కదా!

జాగ్రత్తగా గెడ్డం గీశాడు.

తువ్వాలుతో మొహం తుడిచాడు.

హమ్మయ్య!

మళ్ళా ఇన్నాళ్ళకి కళకళలాడుతున్న బాబావారి మోహాన్ని చూడగలిగామని అందరూ అనుకొన్నారు.

చెట్ల వెనుక దాగిన సూర్యుడు ఒక్కసారి బడటకి వస్తే ఎంత కాంతితో వెలిగిపోతూ కనిపిస్తాడో, అంతకు వెయ్యిరెట్ల కాంతితో బాబావారి నగుమోము ప్రత్యక్షమైంది.

ఈరోజు మనకి సుదినం అనుకొన్నారు అందరూ.

తమ అదృష్టానికి పొంగిపోయారు.

ఆవేళ అంటే డిసెంబరు 9వ తేదీ ఉదయం బాబావారు దారా హన్యోటియాని చివాట్లు పెట్టారు.

ఈ కుర్రాడికి ధ్యానం అంటే రోత.

తెల్లవారుఝామున మూడు గంటలకే లేచి కూర్చొని ధ్యానం చేయాలంటే మరీ రోత.

హాయిగా పడుకోకుండా ఇదేమి తిప్పలు బాబా అనుకొనేవాడు.

అందరిలా నువ్వుకూడా మూడింటికే లే.

ధ్యానం చేయి అని బాబావారు చాలాసార్లు చెప్పాడా కుర్రాడికి,

అయినా వాడు మాటవింటే కదా.

ఇలా లాభం లేదనుకొని ఈవాళ బ్రహ్మాస్త్రం ప్రయోగించారు బాబా.

నువ్వు కనుక నేను చెప్పినట్లు చేయకపోతే నా దర్శనం నీకు దొరకదు.

నువ్వు నా దగ్గరకి రానక్కర్లేదు అని హెచ్చరించారు.

ప్రేమాశ్రమం పిల్లల లాగా, వీడు కూడా బాబావారి దర్శనం కోసం ఎప్పుడూ పరితపిస్తూ వుంటాడు.

నిద్ర కరువయినా ఫరవాలేదు కానీ, ప్రభు దర్శనం కరువైతే వుండగలరా!

ఎవరికి ఏ మంత్రం వేయాలో సృష్టి మంత్రం చెప్పిన విశ్వధాముడికి బాగా తెలుసు.

హన్యోటియా నిద్ర ప్రహసనం పేరు చెప్పి బాబావారు ఆవాళ నిద్ర మంచి – చెడ్డలు చెప్పారు.

సుఖ నిద్ర గురించి వివరించారు.

మంచిగా హాయిగా నిద్రపోగలిగితే ఆరోగ్యం బాగుంటుందని అంటూ ఆరోగ్య సూత్రాన్ని చెప్పారు.

నిద్ర మంచిదే.

గాఢ నిద్ర అయితే మరీ మంచిది.

అయితే మరీ మొద్దు నిద్ర పోకూడదన్నారు.

నిద్ర ఓ మోతాదులో వుండాలన్నారు.

ఎవరికైనా నాల్గయిదు గంటల నిద్ర సరిపోతుందన్నారు.

ఆ మాత్రం నిద్ర ఆరోగ్యానికి మంచిదన్నారు.

పడుకొన్న కాసేపు హాయిగా పడుకోవాలి.





కలలకి దూరంగా వుండాలి అన్నారు.

గాఢ నిద్ర కోసం ఏంచేయాలో కూడా బాబావారు శెలవిచ్చారు.

తాము చెప్పే పద్ధతి కొంచెం కష్టంగా వుంటుంది అన్నారు.

అయినా సరే శ్రద్ధగా వినండి.

బుద్ధిగా పాటించండి.

కొంచెం అలవాటయితే మీకే తెలిసివస్తుంది నామాట అన్నారు.

ఇంతకీ బాబావారి నిద్ర మంత్రం ఏమిటీ అంటే, అర్ధరాత్రి మెలుకువ తెచ్చుకోవాలి.

మళ్ళీ నిద్రలోకి జారిపోకూడదు.

కళ్ళు ఎంత భారంగా వున్నా సరే, నిద్ర ఎంత ముంచుకు వస్తున్నా సరే నిద్ర పోకూడదు.

ఇదేమన్నా ఆషామాషీ పనా ఏమన్నానా?

అందుకనే బహుశా తాము చెప్పబోయే నిద్ర మంత్రం కష్టంగా వుంటుందనీ, కష్టమైనా ఇష్టంగా పాటించమనీ బాబావారు హెచ్చరించి వుండాలి.

తమ నిద్రోపదేశం అర్దమయిందో లేదో అని కాబోసు బాబావారు ఇంకో వివరణ ఇచ్చారు.

రాత్రి ఎనిమిదింటికే మీరు మంచం ఎక్కారనుకోండి.

ఏదో కారణం చెప్పి, ఒంటి గంటకి మెళ్ళుకువ వచ్చిందనుకోండి.

కాలు ముడుచుకోవడానికనో మరే కారణమయినా కావచ్చు,

మీకు మెళుకువ వచ్చిందనుకోండి.

లేచి కూర్చొంటారు.

కాస్తంత ఒళ్ళు విరుచుకొంటారు.

నిద్రమత్తు కొంత వదిలింది.

అయినా ఇప్పుడు చేసేది ఏముంది కనుక అని మళ్ళీ నిద్ర పోదామనుకోవద్దు.

హాయిగా మెళుకువగా కూర్చోండి.

నాలుగు కొట్టాక ధ్యానం మొదలుపెట్టండి.

నాలుగు నుంచి ఆరు వరకు ధ్యానానికి మంచి సమయం.

అందువల్ల ఆరింటి వరకు ధ్యానం చేయండి.

ధ్యానం వద్దనుకొంటే, ఏదైనా పుస్తకం చదవండి.

అదీ ఇదీ కాకపోతే మంచం దిగి, బయటకు వెళ్ళండి.

ఇంటి చుట్టూరా పచార్లు చేయండి.

వ్యాహాళికి వెళ్ళిరండి.

మళ్ళా మంచంపై వాలకపోతే, రేపు శరీరం నామాట వింటుందా, ఎనిమిదింటికి

పడుకున్నాను. పదకొండింటికే మెళకువ వచ్చింది. ఈ మూడు గంటల నిద్ర ఏమూలకి వస్తుంది అని మధనపడకండి అన్నారు.

ఒకసారి మెళుకువ వచ్చాక, నిద్రపోకపోవటమే మంచిది అని స్పష్టం చేశారు. ఒకవేళ నిద్రపోవాలనిపిస్తే, వెంటనే మంచం ఎక్కకూడదు.

కనీసం మూడు గంటలు ఓపిక పట్టాలి అన్నారు.

అంత వ్యవధి అవసరమా అనుకొంటున్న వారికి జవాబుగా మరో మాట చెప్పారు.

మెళుకువ వచ్చిన వెంటనే నిద్రకి వుపక్రమించడం ఆరోగ్యానికి మంచిది కాదన్నారు.

అసలు మళ్ళా నిద్ర పోకపోవడమే శుభప్రదమన్నారు.

ఇది ఏదో వింతలు, విడ్డూరాలు శీర్షికలో కథలాగా వుండవచ్చు.

అబ్బే మనవల్ల ఏమవుతుంది అనవచ్చు.

కానీ ఒక్కసారి అలవాటయితే మీకే తెలుస్తుంది.

కలత నిద్ర వుండదు.

కలలు వచ్చి నిద్రని చెడగొట్టవు.

హాయిగా నిద్ర పడుతుంది.

కమ్మగా పడుకొంటారు.

మరి మంచి నిద్ర వల్ల మీ ఆరోగ్యం బాగుంటుంది అంటూ ఆరోగ్య సూత్రం చెప్పారు. ఆరోగ్యంగా హాయి హాయిగా వుండాలంటే హాయిగా పడుకోవాలి.

కలలు వచ్చి నిద్ర పాడుచేయకూడదు అన్నారు.

మంచి నిద్రకీ, భేషైన ఆరోగ్యానికి ఈ వేళనుంచే ప్రయత్నించమని బాబావారు మండలివారికి చెప్పారు.

ఒకసారి మెళ్ళుకువ వచ్చాక మళ్ళీ నిద్రతో కుస్తీ పట్టకండి అన్నారు.

తెల్లవారుఝామున ధ్యానానికి భేషుగ్గా వుంటుందన్నారు.

ఇది ఏదో బ్రహ్మవిద్య అనుకుంటున్నారేమో భయపడకండి అని ధైర్యం పలికారు.

ఒక్కసారి అలవాటయితే మీకే తెలిసివస్తుంది.

నిద్ర తక్కువైనా ఫరవాలేదన్న సంగతి అన్నారు.

మూడు గంటలే నిద్రపోయినా ధ్యానానికి కూర్చొంటే నిద్ర ముంచుకు రాదని ఘంటాపథంగా చెప్పారు.

ప్రేమాశ్రమం పిల్లలనే ఉదాహరణగా పేర్కొన్నారు.

వాళ్ళు నెలరోజులుగా రాత్రి ఒంటి గంటకే లేచి ధ్యానం చేస్తున్నారు.

వాళ్ళకి నిద్ర ముంచుకు రావటంలేదు సరికదా, ధ్యాన మార్గంలో ముందుకు కదిలారన్న సంగతి గుర్తు చేశారు.

అలా అని మొదటి నుంచీ ప్రేమాశ్రమం పిల్లల తంతు ఇంతే అనుకోవద్దన్నారు.





మొదట్లో వాళ్ళకీ నిద్ర సరిపోయినట్లుంటేది కాదు.

ధ్యానం చేస్తుంటే నిద్ర ముంచుకువచ్చేది.

సాధనతో గట్టెక్కారు.

నిన్న (డిసెంబరు 8వ తేది) ఒక్క కుర్రాడే ధ్యానం మధ్యలో వదిలి మంచం ఎక్కాడు.

మిగిలినవాళ్ళు కూర్చున్న చోటునుంచి కదలలేదు.

వాళ్ళ ఏకాగ్రతకి భంగం కలగలేదు అంటూ, ప్రేమాశ్రమం పిల్లలు మండలివారికి ఆదర్శం కావాలన్న మాటని చెప్పకనే చెప్పారు.

టోకా నుంచి మెహెరాబాద్‌కు వాపసు వస్తున్నప్పుడు చాలామంది మండలివారికి నలతగా వుందన్న సంగతి పాఠకులకి గుర్తుంది కదా.

పాత చోటుకి తిరిగివచ్చినా అనారోగ్యం వదలలేదు చాలా మందిని.

వారందరికీ బాబావారు స్వయంగా దగ్గర వుండి చికిత్స చేయించారు.

డాక్టరు చెప్పిన మందులు సకాలంలో వాళ్ళకి ఇచ్చేలా చూశారు. ఒంట్లో బాగోలేదు కదా అని మంచానికో, కుర్చీకో అతుక్కుపోవాలనుకొన్న వారికి బాబావారు నిరాశ కల్గించారు.

నలత దారి నలతదే.

తమ శిక్షణ దారి శిక్షణదే అన్నట్లు చిన్నా చితకా పని అందరికీ అప్పగించారు.

బియ్యంలో రాళ్ళు, మట్టి బెడ్డలు ఏరే పని కొందరది అయితే, పప్పు శుభ్రం చేసే పని ఇంకొందరిది.

చిక్కుడు కాయల ఈనె తీసి, తుంచి వంటకి రెడీచేసే పని మరికొందరిది.

అంటే బాబావారి దగ్గర ఎవరికీ విశ్రాంతి, విరామం వుండవు.

ఏదో ఒక పనిలో నిమగ్నం కావాల్సిందే.

సేవలో పరమార్థత తెలుసుకోవటానికి ఇంతకంటే భేషైన మార్గం మరొకటి వుండదేమో!

అప్పట్లో హోమీసాథా పిల్లా దంపతులు అక్బర్ ప్రెస్‌లో వుంటున్నారు.

సాథా నివాసానికి అక్బర్ ప్రెస్ అన్న పేరు ఎందుకు వచ్చిందో తెలుసా?

ఈ విషయాన్ని సాథా కుటింబీకులుని అడిగితే వారిలా చెప్పారు.

మా పూర్వీకులు ఈ ఇల్లు కొన్నారు.

అప్పట్లో ఇక్కడ ప్రింటింగ్ ప్రెస్ వుండేదిట.

ఆ ప్రెస్ పేరు అక్బర్ ప్రెస్. యజమానులు ఎవరో తెలియదు కానీ, అది చాలా పాత ప్రెస్ అని మాత్రం విన్నాము.

**–సశేషం**

# నవ జీవనము

**దశిక నిర్మలాదేవి**

ప్రభో! పరంధామా!
పరాత్పరా! పరమోన్నతమోన్నతా!
ఆత్మబంధూ! అవ్యక్త సూత్రధారీ!
అనంత ప్రేమనిధీ! కరుణాపయోనిధీ!
సకల జగత్కళ్యాణ కార్య నిర్వాహకా
సర్వ మానవ మనోవికార నిర్మూలకా
సమస్త జీవకోటి ప్రాణాధారకా
సత్‌చిత్ ఆనందతమ స్థితి కారకా!
భవబంధ విముక్తి కర్తా
పరమపద మోక్ష ప్రదాతా
"హై య్యె స్టఫ్ దిహై" నని "యుగావతారుడ" నని
నిర్ద్వంద్వ స్పష్టోద్ఘాటిత మౌన సందేశ ప్రేమ విశ్వరూప ప్రదర్శకా!
చిత్త భ్రమల నుత్తరించు
తత్వజ్ఞాన తృష్ణదీరు నౌక మార్గము జూపవా!
సంసార సాగర మాయామేయ భయానక జలతరంగ
సుడిగుండముల బడక బయల్వడు నావ ఏదయా!
రాగద్వేష, సుఖ: దుఖ, ఆశ - నిరాశాది ద్వైధీభావ
బడబానల ప్రభావ సెగల తాపము తప్పించు నుపశమ మెక్కడయా!
అజ్ఞాన జీవులము, మోహాను రక్తులము, అగమ్య పథకులము
అహంకార, మమకార తమస్సుల నుండి సత్యజ్యోతి పథమున
జీవన్ముక్తి బడయుటెట్లయా!
వ్యాసుల వారి పురాణాల రాశి
బుద్ధుల బోధనలు తలకెక్కుట లేదు!
రామానుజ శంకర మధ్వుల ద్వైతా ద్వైత
విశిష్టా ద్వైతముల చిక్కులు వీడుట లేదు!
రాఘవేంద్ర వీరబ్రహ్మేంద్రుల సూక్తి కాల జ్ఞానతత్వాదులు
ఆత్మబోధలు చింతలు దీర్చుట లేదు!
రామకృష్ణ రమణాదుల ఉపదేశములు





బుద్ధి కేంద్రముల కవగతమౌట లేదు!
దేవళములు ప్రార్థనామందిరములు
సంక్షుభిత మనమునకు సాంత్వన నిచ్చుట లేదు!
లోకరుచులు - స్పందిత హృదిచంచలములు
లౌకికాకర్షణలు - తత్బంధనములు
తన్వాత్మలను వీడుట లేదు
ఇక సద్గతి దర్శనమిచ్చు గతి ఏ విధినయా!
లోకోద్ధరణ కుద్భ వించిన నీ వుద్యమించి
ప్రతిపాదించి - ఆచరించి - ప్రసాదించిన
**నవజీవనమ**ను పథము జూతునా !?
నాబోంటి సామాన్యుల కది ఆచరణ సులభమా??!
సాధన శక్యమా???!
**పుట్టల గుట్టల అడవుల గుహల**
**చెక్కపెట్టెల చెట్టు నీడల చీకటి గుహ్యారముల నుంటివి -**
**అష్టకష్టముల నడుమ చిరునవ్వులు చిందుమంటివి -**
**ఆశకూడదంటివి -**
**ఎవరి సహాయము కోరకంటివి -**
**ఏ లక్ష్యములు గమ్యములు నిర్దేశించుకోవద్దంటివి -**
**బంధాలు బాధ్యతలకు చిక్కకుమంటివి -**
**భౌతిక అధి భౌతిక సంపర్కములు వలదంటివి -**
**సర్వ సంగమములను పరిత్యజించుమంటివి -**
**అనర్థార్థము కూడదంటివి -**
**దేహ పోషణార్ధ నిమిత్తము భిక్ష నర్థించుమంటివి -**
**ఏమొచ్చిననూ - ఎలావచ్చిననూ సణగక గొణగక భరించుమంటివి -**
**ప్రతి ఫలితము నీ ప్రసాదమంటివి -**
**అసహజత్వ నడకలను**
**అసత్య భాషణములను**
**ఈర్ష్యా ద్వేషములను**
**క్రోధావేశములను**
**దర్పలాలసలను**
**లేశ మాత్రమునూ ప్రదర్శించక సంపూర్ణముగ విసర్జించమంటివి -**
**కుల మత భాషా మూలమున విలువిచ్చుట వలదంటివి -**

సృష్టియంతయూ దైవ ప్రేమకు సమార్థమంటివి –
సర్వ సమర్పణతో,
సంపూర్ణలయముతో
నిరాపేక్షతో
ఆరాధనా పూర్వకభక్తితో
ప్రేమకై మాత్రమే
భగవంతుని ప్రేమించమంటివి –
అతులతమైన అవధులులేని ప్రేమయే నిను చేరు మార్గమంటివి –
నవజీవన పథమిది అనంత నిరంతర ప్రవాహమంటివి –
ఎవరున్ననూ లేకున్ననూ శాశ్వతముగ సజీవముగ సాగునంటివి –!
ఇట్టి గట్టి కఠిన శిలా సదృశ నియమములు బెట్టిన
పాటించు టెట్లు?! ఏమనియెదను?! సగటు జీవిని !
అయినను ఓ సర్వాంతర్యామీ !
నిను వదలను
నీ ధామము నా ఎదయందే బందీ చేయుదును
నీ కొంగునే బట్టుకొనియెదను
నీ మనోచ్ఛరితమై
నీ వనుగ్రహించిన
"అవతార్ మెహెర్ బాబాకీ" జై అన్న
సత్య సాధక జీవతారక మంత్రమునే అనవరతము స్మరియించెదను !
మౌన ప్రేమను వర్షించు నీ చిన్మయ ముద్రనే
మన:ఫలకమున ప్రతిష్టించి నిరతము ధ్యానించెదను!!
నా జీవన గమనము నీ నిర్ణయముల కొదిలెదను
ఇచ్చిన గతము ఇంక నిచ్చు భవితవ్యము నీ ప్రేమేనని తలచెదను!
సమస్త కార్యకారణములు నీ ఇచ్ఛే ననుకొందును !!
నీవు జూపు మహత్ప్రేమనే ఎల్లరి యందు దర్శింతును !
నీలో లయమునకై అలుపెరుగక నీ ప్రేమ పిలుపునకై చూచుచుందును!!
ఇదియే నాకై నీవేర్పరచిన మహా ప్రేమ నవ జీవనమనుకొందును !!!
అవతార్ మెహెర్ బాబాకీ జై !
అవతార్ మెహెర్ బాబాకీ జై !!
అవతార్ మెహెర్ బాబాకీ జై !!!
ఓం తత్సత్ !

❀





# డా. విజయసారధి షష్ఠిపూర్తి

డా॥ యలపర్తి విజయసారధి గారి షష్ఠిపూర్తి, బాబా ప్రేమిక సహవాస్ తాడేపల్లిగూడెంలోని ఇంకూలు వారి కళ్యాణమండపంలో 22.7.2012న ఉ. 8.30 ని.లకు ఏర్పాటు చేసినట్లు ఆహ్వానం పంపారు. శ్రీ కోడూరి శివరామకృష్ణ తులసీ ప్రసాద్, కొవ్వూరు, బాబా సప్తవర్ణ పతాక ఆవిష్కరణతో కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

# వివాహం

శ్రీ లక్ష్మణ్ – స్వరూప గారల కుమార్తె చి॥ల॥సౌ॥ హారిక వివాహము శ్రీ సి. హెచ్. రాజేశం – ఉమాదేవి గారల కుమారుడు చి॥ బాలచందర్‌తో ది. 26.7.2012 గురువారం 11.30 ని.లకు జై నారాయణ ముందాడ్ కళ్యాణమండపం, కరీంనగర్‌లో జరుపబడునని, బాబా ప్రేమికులు తప్పక హాజరు కావల్సిందిగా శ్రీ జి. సత్యయ్య, హైదరాబాద్ ఒక ప్రకటనలో కోరారు.

# ముటుకూరు సెంటర్

అవతార్ మెహెర్‌బాబా ముటుకూరు సెంటర్ బాబా ప్రేమికులు శ్రీ సి. శాంతారాము స్థానిక బ్యాంకు మేనేజరు, మోర్జంపాడు, గుంటూరు జిల్లా నుండి రాజమండ్రి బ్యాంకుకి రీజనల్ ఆఫీసరుగా ప్రమోషన్ అయిన సందర్భముగా ముటుకూరు సెంటర్ బాబా ప్రేమికుల పక్షాన వారికి 1.7.2012 ఆదివారం నాడు వీడ్కోలు ఇవ్వడమైంది. వారి బదిలీ మాకు ఒక తీయని బాధ కల్గించిందని ముటుకూరు సెంటర్ నిర్వాహకులు శ్రీ యాగంటి సుబ్బయ్య అన్నారు.

ఈ కార్యక్రమానికి బాబా ప్రేమికులు శ్రీయుతులు కనకయ్య, వి. అచ్యుతరావు, శ్రీమతి ఆర్. సత్యవతి, పద్మనాభరెడ్డి, యం.వి. రెడ్డి, రాజేశ్వరరావు, సుధాకరరావు విచ్చేశారు. బాబా పాటలు మధురాతి మధురంగా పాడారు. శాంతారాము గారికి నూతన వస్త్రాలు, బాబా ఫోటో, శాలువతో సత్కరించారు.

# సిరిసిల్ల సెంటర్ 29వ వార్షికోత్సవం

సిరిసిల్ల సెంటర్ 29వ వార్షికోత్సవాన్ని 16.6.2012 శనివారం ఉ. 7 గంటల నుండి సా. 9 గంటల వరకు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ అన్నా ఖండాలే, మెహెరాబాద్ నుండి ప్రత్యేక అతిథిగా పాల్గొని బాబా సందేశాలపై ప్రసంగించినట్లు తెలిపారు.

❀

# భక్తికి ప్రచారమా?

**భగవంతుడి ఆరాధనకు ఆడంబరం అవసరం లేదన్నారు మెహెర్‌బాబా.**

మీ భగవరాధన మీ హృదయాలను దాటి ఆవలకు రాకుండా జాగ్రత్తపడటం మంచిదన్నారు. ప్రాపంచకంగా మీ విధులన్నింటికీ హాజరవుతూ మీరు చేసే మంచి పనులూ, అలాగే చెడు పనులన్నీ కూడా భగవంతునికి వినయపూర్వకంగా అర్పించమన్నారు. ఉదయాన్నే స్నానం చేశాక మంచి దుస్తులు ధరించి ఇక మనం వాటిని పదే పదే చూసుకోం కదా...అదేమాదిరి...మీ హృదయం భగవన్నామంతో నిండివున్నప్పుడు ఆ దేవదేవుడు మీ వెన్నంటే వుంటాడని బాబా అన్నారు.

ఈ విషయాన్నే మరింత స్పష్టంగా తెలియజేసేందుకు బాబా ఒక కథాంశంలో ఇలా చెప్పారు.

ఐతే, ఇది చాలా అరుదైన విషయం.

నూటికో కోటికోగానీ ఇలాంటివారు తారసపడరు.

ఐనప్పటికీ ఆ కొద్దిమందీ బహు ధన్యులన్నారు బాబా.

ఈ కథ చాలా సంవత్సరాల క్రితం ఒక ప్రాంతాన్ని ఏలిన **రాజు-రాణిలకు** సంబంధించింది. రాజు గారు చాలా దయార్ద్రహృదయుడు. గొప్ప తెలివైనవాడు. మంచి పరిపాలనాదక్షుడు. ప్రజలు కూడా సుఖ సంతోషాలతో హాయిగా వున్నారు. రాజ్యం సుభిక్షంగా వుంది. ఒక్కమాటలో చెప్పాలంటే ... అదొక ఆదర్శ రాజ్యం. ఐతే, ఒక చిన్న విషయం వల్ల రాణి గారికి సంతోషంగా లేదు.

ఏమా చిన్న విషయం అంటే....రాజు గారు దైవీ సంబంధ కార్యక్రమాలపై బొత్తిగా ఆసక్తి చూపడు. అంతమాత్రాన ఆయనేమీ ఎథీస్ట్ కాదు. దేముడంటే నమ్మకంలేని వాడేమీ కాదు. రాజు గారి భార్య తరచు చేసే అనేక పూజలు, వ్రతాలు, నోములు ఇత్యాది వేడుకలకు ఆయనెప్పుడూ అడ్డు చెప్పిన పాపాన పోలేదు.

వచ్చిన చిక్కల్లా ఏమంటే ఆ కార్యక్రమాల్లో రాజు గారు ఎన్నడూ పాల్గొనడు. తనమానాన తన పనులు చక్కబెట్టుకుంటాడు. ఆయన ఎంత మంచి వాడైనా దైవ కార్యాల్లో తనతో కలిసి పూజాదిక్రతువులు నిర్వహించడం లేదన్నది రాణి గారి తీవ్ర అసంతృప్తికి కారణం. కనీసం దేవుని పటానికి దణ్ణం కూడా పెట్టుకోడని, దీపారాధన కానీ, దేవుని నామస్మరణ కూడా ఆయన ఎన్నడూ చేయడని ఆమె వాపోయేది. రాజు గారిని తన దారికి తెచ్చుకోవడానికి ఆమె ఎన్నో విఫలయత్నాలు చేసింది.

దైవ కార్యక్రమాల్లో పాల్గొనమని ఆమె ఎన్నిసార్లు ప్రాధేయపడ్డా రాజు గారు





ఎప్పుడూ ఏదో ఒక సాకు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాడని ఆమె విసుగెత్తిపోయింది. ఈ ఒక్కవిషయమే ఆమె జీవితంలో ఎంతో కలవరపెట్టింది.

ఈ ఒక్క కారణంగా తమ రాజ్యంలో నెలకొన్న శాంతి సౌభాగ్యాలు ఎంతోకాలం నిలవవేమోనని ఆమె భయపడుతుండేది. దీంతో రాణి గారు నిత్యజీవితంలో అన్నీ పోగొట్టుకున్నదానిలా దిగాలుగా వుండేది. ఇది ఒక తీరని వ్యధగా ఆమెకు పరిణమిస్తుంది. క్రమేణా ఆమె రాజభవన ప్రాంగణాన్ని వదలి బయటకు రావడం కూడా మానివేసింది. రాజ భవనంలో వున్న దేవాలయానికే ఆమె పరిమితురాలైంది. ఆమెలో నైరాశ్యత, వైరాగ్యం చోటుచేసుకున్నాయి. ఆమె అలా దిగాలుగా వుండటానికి కారణం ఏమిటని రాజు గారు ఎన్నిసార్లు అడిగినా...ఏమీ లేదని...ఆమె పొడిగానే సమాధానమిస్తుంది. ఎంతో రెట్టించి అడిగితే...రాజు గారు కూడా తనతో నిత్యం దైవీ కార్యక్రమాల్లో పాల్గొంటే బాగుంటుందన్న తన చిన్న కోరిక నెరవేర్చమని అడగ్గానే.... నీవేమైనా అడుగు కానీ....**అదొక్కటీ అడుగొద్దని** సున్నితంగా ఆయన మాట తప్పించేవాడు.

ఇలా కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి. కాగా, ఒక రోజున ఉదయాన్నే తన కోట అగ్రభాగానికి వెళ్ళిన రాజు గారు తన రాజ్యంలో ప్రజలందరూ ఆనంద పారవశ్యంతో ఇళ్ళ ముందు రంగవల్లులు దిద్ది పండుగ చేసుకోవడం చూశాడు. ప్రత్యేకంగా ఆ మాసంలో ఆ రోజున వచ్చే పెద్ద పండుగ ఏమీ లేదని ఎరిగిన రాజు తన ప్రధాన మంత్రిని పిలిచి ఈ వేడుకలకు కారణం ఏమని అడిగాడు. తనకూ ఏమీ తెలియదని, ఇదంతా రాణి గారి ఆజ్ఞ అని ముక్తసరిగా మంత్రి జవాబిచ్చాడు.

ఓ అలాగా! అని రాణి గారినే నేరుగా అడుగుదామని వెళ్ళేసరికి ఆమె కళ్ళు మిరుమిట్లు గొలిపే క్రొత్త బట్టలు కట్టి దేదీప్యమానంగా వెలిగిపోతోంది. రాజు గారిని చూడగానే ఆమె ఆనందంతో **నేనెంతకాలంగానో ఎదురుచూస్తున్న నా కల నిజమైంది. అందుకే ఈ సంబరాలు, వేడుకలు మన రాజ్యంలోని ప్రజలందరూ జరుపుకుంటున్నారని** చెప్పింది. ఇంతకీ ఏమీటా విశేషం? అని సంభ్రమాశ్చర్యాలలో ఉక్కిరి బిక్కిరి అవుతున్న రాజు గారు తిరిగి అడిగేసరికి ...ఓ **మహారాజా! నిన్నరాత్రి మీరు ఒక ప్రక్కగా తిరిగి పడుకుని నిద్రలోనే బిగ్గరగా భగవంతుని నామం ఉచ్ఛరిస్తుండటం నేను స్పష్టంగా విన్నాను.** అలా విన్నాక నా వేదన, ఆవేదన, ఆ సర్వేశ్వరుడు ఆలకించాడన్న ఆనందంతో ప్రజలందరూ పండుగ జరపుకోవాలని ఆజ్ఞాపించానని చెప్పింది. ఈ రోజు కోసమే నేను వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నానని ఆమె రాజు గారితో చెప్పింది.

**ఈ మాటలు వింటూనే రాజు గారు హే ప్రభూ!...భగవాన్! ఇంతకాలం నా హృదయంలో గోప్యంగా వున్న నీవు నేడు నా పెదవులపై నుండి బయటకొచ్చేశావా స్వామీ! అని అంటూ మహారాజు ఒక ప్రక్కగా కుప్పకూలిపోయాడు. శ్వాస వదిలేశాడని బాబా అన్నారు.**

*

# ప్రభుస్తుతి

## ప్రభుస్తుతి

ఓ పర్వర్దిగార్,
సర్వపోషకా! సర్వ రక్షకా!
నీవు ఆదియును
అంతమును లేని వాడవు,
అద్వయుడవు,
నిరుపమానుడవు,
నీ ప్రమాణమెవ్వరును
ఎరుంగనేరరు
నీవు వర్ణము,
నామము,
రూపము,
గుణములు లేని వాడవు.
నీవు అపరిమితుడవు
గంభీరుడవు,
ఊహాతీతుడవు,
భావనాతీతుడవు,
శాశ్వతుడవు
నాశము లేని వాడవు.
నీవు అవిభాజ్యుడవు,
దివ్యచక్షువులతో గాని
నిన్నెవరును చూడజాలరు
నీవు ఎల్లప్పుడు నుంటివి,
నీవు ఎల్లప్పుడు నున్నావు
నీవు ఎల్లప్పుడు నుందువు
నీవు అంతటను గలవు,
నీవు అన్నింట నున్నావు.

మరి నీవు అంతటికి
అన్నింటికి
ఆవలనుందువు.
నీవు ఆకాశమును గలవు
పాతాళమున గలవు
నీవు వ్యక్తుడవు
అవ్యక్తుడవు,
అన్ని భూమికలందున్నావు,
అన్ని భూమికల కతీతుడవు.
నీవు మూడు
లోకాలలోనున్నావు
ముల్లోకాల కావలగూడ నున్నావు.
నీవు అగోచరుడవు,
స్వతంత్రుడవు.
నీవు సృష్టికర్తవు,
ప్రభువులకు ప్రభుడవు,
అందరి మనస్సులను
హృదయములను
ఎరిగిన వాడవు,
నీవు సర్వశక్తిమంతుడవు,
సర్వవ్యాపివి,
నీవే అనంతజ్ఞానము,
అనంత శక్తియు,
అనంత ఆనందమును.
నీవు జ్ఞానసాగరుడవు,
సర్వజ్ఞుడవు,

అనంత జ్ఞానివి,
త్రికాల వేదివి,
జ్ఞానమే నీవు,
నీవు సర్వదయాళుడవు,
నిత్య శుభంకరుడవు,
నీవు ఆత్మలకెల్ల నాత్మవు
అనంతగుణ విశిష్టుడవు,
నీవు సత్య, జ్ఞాన
ఆనందముల
త్రిమూర్తివి,
నీవే సత్యమునకు
మూలము,
ప్రేమ మహాసాగరుడవు,
నీవు పురాణ పురుషుడవు,
సర్వోత్తముడవు,
నీవు ప్రభుడవు,
పరమేశ్వరుడవు,
నీవు పరుడవు,
పరాత్పరుడవు,
నీవు పరబ్రహ్మవు,
అల్లాహ్,
ఇలాహీ,
యజ్‌దాన్,
అహురమజ్ దా,
ప్రియతముడైన
భగవంతుడవు,
నీవు 'ఈజద్' అనబడు
ఏకైక పూజ్యుడవు.





# పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్‌దాన్**
**లా ఇలాహ్ ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

# మండలి ప్రార్థన

ప్రియ దైవమా!

నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము.

మరియు చిట్టచివరి వరకు బాబా కొంగును దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.